



# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

విజయవాడ, హైదరాబాద్ నుండి ప్రచురణ






| విజయవాడ | సంపుటి : 25 | సంచిక : 26 | ది. 24-4-2026 | శుక్రవారం | పేజీలు : 8 | వెల : రూ.1/- |
|---|---|---|---|---|---|---|
| VIJAYAWADA | Vol.No : 25 | Issue No : 26 | Date : 24-4-2026 | Friday | Pages : 8 | Rs.1/- |


## పశ్చిమబెంగాల్ లో విజయం బిజెపి దే

- బెంగాల్‌లో ఇవాళ నమోదైన పోలింగ్ శాతమే దీనికి నిదర్శనం: ప్రధాని మోదీ
- బెంగాల్‌లో నేడు 152 స్థానాల్లో తొలి దశ పోలింగ్
- రికార్డు స్థాయిలో పోటెత్తిన ఓటర్లు
- మే 4వ తేదీ బెంగాల్ లో మార్పునకు నాది అంటూ మోదీ హర్షం
- టీఎంసీకి వ్యతిరేకంగా మహిళలు, యువత పోరాటం ప్రారంభించారని వ్యాఖ్యలు



**మధురాపూర్, ఏప్రిల్ 23 (వార్తాప్రభ) :** పశ్చిమ బెంగాల్‌లో అధికార తృణమూల్ కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా దండెత్తింది బీజేపీ కాదని,రాష్ట్రంలోని మహిళలు, యువతే చురుకైన పోరాటాన్ని ప్రారంభించారని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. గురువారం 152 నియోజకవర్గాల్లో జరిగిన తొలిదశ అసెంబ్లీ ఎన్నికల్లో నమోదైన అధిక ఓటింగ్ శాతమే దీనికి నిదర్శనమని ఆయన వ్యాఖ్యానించారు. బెంగాల్ లో సాయంత్రం 5 గంటల సమయానికి 89.93 శాతం ఓటింగ్ నమోదైంది. రెండో దశ ఎన్నికలు ఏప్రిల్ 29న జరగనున్న నేపథ్యంలో, దక్షిణ 24 పరగణాల జిల్లాలోని మధురాపూర్‌లో నిర్వహించిన ప్రచార సభలో ప్రధాని మాట్లాడారు. తీవ్రమైన ఎండను కూడా లెక్కచేయకుండా ఓటర్లు పోటెత్తడం చూస్తుంటే, మే 4వ తేదీ కేవలం ఫలితాల రోజు మాత్రమే కాదని, పశ్చిమ బెంగాల్‌లో మార్పునకు నాంది పలికే రోజని రుజువు చేస్తోందని మోదీ పేర్కొన్నారు. "ఈరోజు ఓటర్లలో కనిపించిన ఉత్సాహం, ముఖ్యంగా మహిళలు, తొలిసారి ఓటు హక్కు వినియోగించుకుంటున్న యువతలో కనిపించిన ఆసక్తి, తృణమూల్ కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా నిజమైన పోరాటాన్ని ప్రారంభించింది వారేనని నిరూపించింది" అని ఆయన వివరించారు. ఇటీవల లోక్‌సభలో మహిళా రిజర్వేషన్ చట్ట సవరణను అడ్డుకోవడంలో తృణమూల్ కాంగ్రెస్ పోషించిన పాత్రతో ఆ పార్టీ అసలు స్వరూపం రాష్ట్రంలోని మహిళలకు అర్థమైందని మోదీ అన్నారు. "లోక్‌సభలో జరిగిన పరిణామాలతో తృణమూల్, ఇతర ప్రతిపక్ష పార్టీల మహిళా వ్యతిరేక వైఖరి బయటపడింది. అందుకే ఈ ఎన్నికల్లో తృణమూల్ కాంగ్రెస్‌కు గట్టి గుణపాఠం చెప్పాలని బెంగాల్ మహిళలు నిర్ణయించుకున్నారు. మహిళా సాధికారతకు అడ్డంకిగా నిలిచినందుకు ఈసారి తృణమూల్‌ను వారు కచ్చితంగా శిక్షిస్తారు. బెంగాల్ కాళీమాత, దుర్గామాత వెలసిన నేల. కానీ తృణమూల్ పాలనలో ఇక్కడ మహిళలకు భద్రత లేదు. కాబట్టి మీ ఓటు అన్నింటినీ మారుస్తుంది. ఇకపై అన్యాయాన్ని సహించవద్దు" అని ఆయన పిలుపునిచ్చారు. పశ్చిమ బెంగాల్‌లో 15 ఏళ్ల తృణమూల్ కాంగ్రెస్ పాలనకు మే 4వ తేదీ గడువు తేదీ అవుతుందని మోదీ జోస్యం చెప్పారు. అవినీతి, దోపిడీ, హింస, మహిళలపై నేరాలతో నిండిన చీకటి రోజులు ఆ రోజుతో ముగిసిపోతాయని ఆయన ధీమా వ్యక్తం చేశారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత, అక్రమ చొరబాట్ల విషయంలో శూన్య సహన విధానాన్ని అవలంబిస్తామని స్పష్టం చేశారు. "దక్షిణ 24 పరగణాల జిల్లాలో స్థానిక మత్స్యకారుల హక్కుల వాటాను అక్రమ చొరబాటుదారులు లాక్కుంటున్నారు. కానీ తృణమూల్ కాంగ్రెస్ మాత్రం తమ ఓట్ల కోసం అక్రమ చొరబాట్లను కొనసాగించాలని కోరుకుంటోంది. అక్రమ చొరబాటుదారులపై ఎలాంటి చర్యలు తీసుకున్నా తృణమూల్ వ్యతిరేకిస్తోంది" అని ప్రధాని ఆరోపించారు.

## ఉత్తరాంధ్రలో ప్రతిరోజూ పెట్టుబడుల పండుగే

- అనకాపల్లిని మరో రంగారెడ్డి జిల్లాగా మారుస్తాం
- 160 గిగా వాట్ల రెన్యూవబుల్ ఎనర్జీ ఉత్పత్తి లక్ష్యంలో 50 శాతానికి పైగా సాధించాం
- విద్యుత్ భారాన్ని భరిస్తున్నాం... విద్యుత్ ఛార్జీలు తగ్గిస్తున్నాం
- నాడు ప్రాక్లెయిన్లతో కూల్చివేతలు... నేడు అభివృద్ధి పనులు
- అన్ని ప్రాంతాల సమగ్రాభివృద్ధి లక్ష్యంగా పని చేస్తున్నాం
- కిల్లర్ పార్టీని దూరంగా పెట్టండి
- రాంబిల్లిలో రెన్యూ ఎనర్జీ గ్లోబల్‌కు చెందిన రెండు ప్లాంట్లకు సీఎం చంద్రబాబు భూమిపూజ







**అనకాపల్లి,ఏప్రిల్ 23 (వార్తాప్రభ) :** ప్రజలపై విద్యుత్ భారాన్ని వేయకుండా... ఆ భారాన్ని ప్రభుత్వం భరిస్తోందని... అలాగే విద్యుత్ ఛార్జీలను తగ్గించేందుకు కృషి చేస్తున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వెల్లడించారు. జాతి నిర్మాణంలో భాగంగా రెన్యూవబుల్ ఎనర్జీ రంగాన్ని ప్రోత్సహిస్తున్నామని సీఎం చెప్పారు. అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం జెడ్ చింతువలో రెన్యూ ఎనర్జీ గ్లోబల్ సంస్థకు చెందిన రెండు ప్లాంట్ల ఏర్పాటుకు సీఎం చంద్రబాబు నాయుడు గురువారం భూమిపూజ నిర్వహించారు. రూ.5,400 కోట్లతో రెన్యూ ఎనర్జీ గ్లోబల్ సంస్థ రాంబిల్లి పెట్టుబడులు పెట్టనుంది. సోలార్ ఇంగాట్-వేఫర్ తయారీ యూనిట్, హైబ్రిడ్ క్యాప్టివ్ రెన్యువబుల్ పవర్ ప్రాజెక్టు పనులకు సీఎం చంద్రబాబు భూమి పూజ చేశారు. రూ.4,200 కోట్లతో 6.5 గిగావాట్ల సోలార్ ఇంగాట్-వేఫర్ తయారీ యూనిట్, రూ.1200 కోట్లతో 125 మెగావాట్ల హైబ్రిడ్ క్యాప్టివ్ రెన్యువబుల్ పవర్ ప్రాజెక్టును రెన్యూ ఎనర్జీ గ్లోబల్ సంస్థ ఏర్పాటు చేయనుంది. ఈ రెండు ప్రాజెక్టులను రెండేళ్లలో పూర్తి చేసేలా లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ ప్రాజెక్టుల ద్వారా 2100 మందికి ఉద్యోగ అవకాశాలు రానున్నాయి. భూమిపూజ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ..."అనకాపల్లి జిల్లా భారీ పెట్టుబడులతో అభివృద్ధిని ఆకర్షిస్తోంది. పెట్టుబడుల్లో ఈ జిల్లా భారత్‌లోనే అగ్రస్థానానికి చేరుతుంది. ఇటీవలే ఆర్సెలార్ మిట్టల్ నిప్పాన్ ఇండియా స్టీల్ ప్లాంట్ ఏర్పాటుకు శంకుస్థాపన జరిగింది. ఇప్పుడు రూ.5,400 కోట్ల పెట్టుబడులతో రెన్యూ ఎనర్జీ సంస్థ 6.5 గిగావాట్ల ఇన్ గాట్ సోలార్ వేఫర్ ప్లాంట్ ఏర్పాటు చేస్తోంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రంగారెడ్డి జిల్లా వెనుకబడిన ప్రాంతం. కానీ ఇప్పుడు ఆ జిల్లానే అత్యంత సంపద కలిగిన ప్రాంతంగా మారింది. విశాఖ సమీపంలోని అనకాపల్లి మరో రంగారెడ్డి జిల్లాగా తయారవుతుంది. కేంద్ర మాజీమంత్రి యశ్వంత్ సిన్హా కుమారుడు సుమంత్ సిన్హా ఈ సోలార్ వేఫర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తున్నారు. వేగంగా అభివృద్ధి చెందుతున్న రంగాన్ని ఎంచుకుని వ్యాపారం మొదలు పెట్టారు... ఇప్పుడు పెట్టుబడులు పెట్టడానికి ఏపీని ఎంచుకున్నారు. రెన్యూ ఎనర్జీ కేంద్ర కార్యాలయాన్ని కూడా ఇక్కడే ఏర్పాటు చేయాలని ఆ సంస్థను కోరుతున్నాను. రెన్యూ ఎనర్జీనే కాదు... జాతీయ అంతర్జాతీయ సంస్థలను ఏపీలో పెట్టుబడులు పెట్టాలని ఆహ్వానిస్తున్నాం. ఏపీలో పెట్టుబడులు పెడితే సురక్షితంగా ఉంటాయి. ఏపీ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పారిశ్రామిక వేత్తలను కోరుతున్నా. గడచిన 22 నెలల్లో 802 ఎంఓయూలు చేసుకున్నాం... వాటిపై నిరంతరం సంప్రదింపులు చేస్తున్నాం. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ ద్వారా అనుమతులు ఇస్తున్నాం. స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్ ద్వారా సుపరిపాలన అందిస్తున్నాం. 2019-24 మధ్య పెట్టుబడులు పెట్టడానికి పారిశ్రామిక వేత్తలు భయపడ్డారు. వేధింపులు, అవినీతి పెద్ద ఎత్తున జరిగింది. 2024లో మీరు వేసిన ఒక్క ఓటుతో ప్రజల్లో అభద్రత, ఆందోళనను తొలగించాం. ఎన్డీఏ బ్రాండ్‌తో ఏపీలో విశ్వాసం తిరిగి వచ్చింది. పరిశ్రమలకు, పెట్టుబడులకు భరోసా వచ్చింది. పారిశ్రామిక వేత్తలకు సహకరిస్తూ భూములు ఇచ్చిన వారికి ప్రభుత్వం అండగా ఉంటుంది. ఉత్తరాంధ్రలో ప్రతి రోజూ పెట్టుబడుల పండుగ. ఈ నెల 28 తేదీన 15 బిలియన్ డాలర్ల పెట్టుబడితో గూగుల్ ఏఐ డేటా సెంటర్‌కు శంకుస్థాపన చేయబోతున్నాం. జూలైలో భోగాపురం విమానాశ్రయం అందుబాటులోకి రాబోతోంది. లారస్ ల్యాబ్ రూ.5 వేల కోట్ల పెట్టుబడితో ముందుకు వస్తోంది. ప్రధాని మోదీ సహకారంతో విశాఖ ఉక్కును కాపాడుకున్నాం. రైల్వే జోన్‌ను కూడా ఏర్పాటు చేసుకున్నాం. విశాఖ-రాజమహేంద్రవరం మధ్య కార్గో కోసం నాలుగు రైల్వేలైన్ల స్పీడ్ రైల్ కారిడార్ వస్తోంది. ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం వేరే రాష్ట్రాలకు వెళ్లాల్సిన అవసరం లేదు. ఇతర రాష్ట్రాల నుంచే ఇక్కడికి వచ్చి ఉపాధి పొందే పరిస్థితి తెస్తాం. ఈ రెన్యూ ఎనర్జీ ప్లాంట్‌తో నన్ను విశ్వసించిన యువతకు ఉద్యోగాలు వస్తున్నాయి."అని ముఖ్యమంత్రి చెప్పారు.

**రెన్యూవబుల్ ఎనర్జీతో జాతి నిర్మాణం..** "అభివృద్ధి సూచికల్లో విద్యుత్ వినియోగం కూడా ఓ భాగం. ఎంత విద్యుత్ వినియోగిస్తే అంత అభివృద్ధి సాధించినట్టే. అందుకే రాష్ట్రంలో విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్లను పెద్ద ఎత్తున ఏర్పాటు చేసేలా ప్రోత్సహిస్తున్నాం. గత పాలకులు విధ్వంసం చేసిన ఆంధ్రప్రదేశ్‌ను పునర్నిర్మాణం చేయాలన్న లక్ష్యంతోనే కూటమి ప్రజా ప్రభుత్వం సుపరిపాలన అందిస్తోంది. సీఐఐ భాగస్వామ్య సదస్సులో రెన్యూ ఎనర్జీ వేలకోట్ల పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు వచ్చింది. అనంతపురం, కర్నూలు జిల్లాల్లో ఇప్పటికే సౌర, పవన విద్యుత్ ఉత్పత్తి జరుగుతోంది. రాంబిల్లిలో సౌర ఫలకాలు తయారవుతాయి. విద్యుత్ సంస్కరణల్ని ప్రారంభించింది మేమే. ఆ ఫలితాలు అందరికీ అందుతున్నాయి.

## కాళేశ్వరం కేసులో హైకోర్టు తీర్పుపై సుప్రీంకోర్టుకు తెలంగాణ సర్కార్

- కేసీఆర్, హరీశ్ లపై చర్యలు తీసుకోవద్దన్న హైకోర్టు
- హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టులో సవాల్ చేయనున్న తెలంగాణ ప్రభుత్వం
- ఇప్పటికే పిటిషన్ సిద్ధం చేసినట్టు సమాచారం



**హైదరాబాద్, ఏప్రిల్ 23 (వార్తాప్రభ) :** జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా మాజీ సీఎం కేసీఆర్, హరీశ్ రావు తదితరులపై తక్షణమే ఎలాంటి చర్యలు తీసుకోవద్దన్న హైకోర్టు ఆదేశాలను సవాలు చేస్తూ తెలంగాణ ప్రభుత్వం సుప్రీంకోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ దాఖలు చేయాలని నిర్ణయించింది. హైకోర్టు తీర్పులోని లోపాలను ఎత్తిచూపుతూ, ప్రాజెక్టులో జరిగిన అసలు అవకతవకలను సుప్రీంకోర్టు దృష్టికి తీసుకెళ్లాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇప్పటికే న్యాయ విభాగంతో చర్చలు పూర్తి చేసి, పిటిషన్ సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. విచారణలో నిబంధనలు పాటించలేదని, ముందస్తు నోటీసులు ఇవ్వలేదని అభిప్రాయపడుతూ హైకోర్టు.. కేసీఆర్, హరీశ్ రావు, స్మితా సబర్వాల్ వంటి వారికి ఊరటనిచ్చింది. అయితే, ప్రాజెక్టు వైఫల్యాలపై పూర్తి స్థాయి విచారణ జరగాలని ప్రభుత్వం పట్టుదలతో ఉంది. సుప్రీంకోర్టులో ఈ కేసు ఎలాంటి మలుపు తిరుగుతుందో అన్నది ఆసక్తికరంగా మారింది.

## అగ్ర వర్ణాల్లో పేదరికాన్ని రూపుమాపుతాం

-రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత



**అమరావతి,ఏప్రిల్ 23 (వార్తాప్రభ) :** ఆర్థికంగా వెనుకబడి ఉన్న అగ్ర కులాల పేదలకు(ఈడబ్ల్యూఎస్ వర్గీయులు) కూటమి ప్రభుత్వం అండగా ఉంటోందని, వారి పేదరికాన్ని పారదోలేలా ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నామని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత మరియు జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. ప్రతి కుటుంబం నుంచి ఒకరిని పారిశ్రామిక వేత్తలు తీర్చిదిద్దే కార్యక్రమంలో భాగంగా ఈడబ్ల్యూఎస్ యువతకు ఎంఎస్ఎంఈ పార్కుల్లో ప్రాధాన్యమిస్తున్నామన్నారు. తాడేపల్లిలో కమ్మ కార్పొరేషన్ కార్యాలయాన్ని మంత్రి సవిత గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ, అందరికీ అందుబాటులో ఉండేలా ఒకే సముదాయంలో కమ్మ కార్పొరేషన్, పాలకమండలి సభ్యుల కార్యాలయాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. బీసీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈడబ్ల్యూఎస్ వర్గీయులకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. గతంలో ప్రకృతి వ్యవసాయం ద్వారా అధిక ఆదాయం కోసం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించామన్నారు. కొద్ది రోజుల కిందట ఎంఎస్ఎంఈ పార్కుల్లో వ్యాపార అవకాశాలపై మరో సదస్సు నిర్వహించామన్నారు. ఏయే రంగాల్లో ఆర్థిక వృద్ధి లభిస్తుందో వాటిపై ఈడబ్ల్యూఎస్ వర్గీయులకు అవగాహన సదస్సులు కల్పించాలన్నది కూటమి ప్రభుత్వ ఉద్దేశమన్నారు. ఈడబ్ల్యూఎస్ వర్గీయులకు గౌరవప్రద జీవనమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. 2029 నాటికి 20 లక్షల ఉద్యోగా కల్పించి తీరుతామన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 22 నెలల్లో ఏపీకి రూ.25 లక్షల కోట్లకు పైగా పెట్టుబడులు వచ్చాయన్నారు. ఈ ఘనత అంతా సీఎం చంద్రబాబుది, మంత్రి లోకేశ్ దేనన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరవాత 6.25 లక్షల ఉద్యోగాలు కల్పించామన్నారు. ఉద్యోగాల కల్పనే కాకుండా.. ప్రతి ఇంటి నుంచి పారిశ్రామిక వేత్తలను తీర్చిదిద్దాలన్నది సీఎం చంద్రబాబు లక్ష్యమన్నారు. ప్రతి నియోజక వర్గంలోనూ ఎంఎస్ఎంఈ పార్కులు ఏర్పాటు చేస్తున్నామని, ఆ పార్కుల్లో ఈడబ్ల్యూఎస్ సామాజిక వర్గానికి చెందిన యువతకు, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు కూడా పెద్దపీట వేస్తున్నామన్నారు. బీసీ కులాలతో పాటు అగ్ర కులాల్లో పేదరికాన్ని రూపు మాపడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. అంతకుముందు అర్చకుల వేదమంత్రోచ్చారణాల మధ్య కార్పొరేషన్ కార్యాలయాన్ని, ఛైర్మన్ ఛాంబర్ ను మంత్రి సవిత ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కమ్మ కార్పొరేషన్ ఛైర్మన్ బ్రహ్మయ్య చౌదరి, ఇతర కార్పొరేషన్ ఛైర్మన్లు నందం అబద్ధయ్య, వీరంకి వెంకట గురుమూర్తి, మల్లె ఈశ్వరరావు, ఆప్కాస్ ఛైర్మన్ రాంప్రసాద్, పలువురు డైరెక్టర్లు, అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## మహిళా బిల్లు ద్రోహి రేవంత్ రెడ్డి

- మహిళలూ...మీ ఇంటికొచ్చే కాంగ్రెస్ నేతలను నిలదీయండి
- మోదీ పంజా విసరడం తథ్యం
- వచ్చే ఎన్నికల్లోనే మహిళా రిజర్వేషన్లను అమలు చేయడం ఖాయం
- మహిళా బిల్లును అడ్డుకున్న పార్టీలన్నీ కుటుంబ పార్టీలే
- సీఎం రేవంత్ రెడ్డిసహా కాంగ్రెస్ కూటమి నేతలపై కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ధ్వజం



**తెలంగాణ,ఏప్రిల్ 23 (వార్తాప్రభ) :** మహిళా రిజర్వేషన్లను అడ్డుకోవడంతోపాటు మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మోసం చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముమ్మాటికీ మహిళా ద్రోహి అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మండిపడ్డారు. పార్లమెంట్ లో మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందుతుందని భావించి సంబురాలకు సిద్ధమైన దేశ మహిళల ఆశలపై నీళ్లు చల్లారని అన్నారు. పులి పంజా విసిరేటప్పుడు ఒక అడుగు వెనకకు వేస్తోందని, అంత మాత్రాన ఓడినట్లు కాదన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ సైతం మహిళా బిల్లు విషయంలో ఒక అడుగు వేశారని, రెట్టించిన ఉత్సాహంతో మరో 10 అడుగులు ముందుకేసీ రాబోయే ఎన్నికల్లోపే మహిళా రిజర్వేషన్లను అమలు చేయడం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. ఈరోజు హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద జరిగిన "మహిళా ఆక్రోశ్ పాదయాత్ర"లో కేంద్ర మంత్రి బండి సంజయ్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ కూటమి నేతలపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఏమన్నారంటే... రాష్ట్రంలో రేవంత్ రెడ్డిని తిట్టని మహిళ లేదు. మహిళా బిల్లును అడ్డుకుని ఏదో సంబురపడుతున్నారు. రేవంత్ రెడ్డిని శాపనార్థాలు పెడుతున్నారు. ప్రకృతిలో తల్లిని కొలిచి పూజించే సనాతన ధర్మం మనది. గోమాత, భూమాత సహా దేవుళ్లను సైతం సతీసమేతంగానే పిలుస్తాం. మోదీ ప్రభుత్వం సైతం మహిళల పేరుతోనే సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నాం. ఈ సంక్షేమ పథకాలే కాకుండా రాజకీయ ప్రాధాన్యమిచ్చి చట్టసభల్లో అడుగుపెట్టేలా చేయాలనే ఉద్దేశంలో మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెట్టింది. దీనిని అడ్డుకుని విపక్షాలు విర్రవీగుతున్నాయి. పులి పంజా విసిరేటప్పుడు ఒక్క అడుగు వెనుకకు వేస్తోంది. ఆ తరువాత 10 అడుగులు ముందుకేసీ పంజా విసురుతుంది. రాబోయే ఎన్నికల్లోపే మహిళా బిల్లును అమలు చేసి తీరుతాం. మోదీ ప్రభుత్వం క్రుత నిశ్చయంతో ఉంది. మహిళా బిల్లును అడ్డుకునే పార్టీలన్నీ కుటుంబ వారసత్వ పార్టీలే. సోనియాగాంధీ, ఇందిరాగాంధీ, కనిమొళి, డింపుల్ యాదవ్, సుప్రియా సూలే పార్లమెంట్ లో ఉంటే చాలు, సాధారణ మహిళలకు చట్టసభల్లో అడుగుపెట్టే అర్హత లేదని కాంగ్రెస్, డీఎంకే, ఎస్పీ, ఎన్సీపీ పార్టీలు చెబుతున్నాయి. అందుకే మహిళా బిల్లును అడ్డుకున్నాయి. పార్లమెంట్ లో బిల్లు ఆమోదం పొందుతుందని సంబురాలకు సిద్ధమైన మహిళల ఆశలపై నీళ్లు చరిత్ర రేవంత్ రెడ్డి. తెలంగాణలోనూ మహిళలకు నెలకు రూ.2500లు, తులం బంగారం, స్కూటీ ఇవ్వకుండా మోసం చేయడమే కాకుండా మహిళా బిల్లును అడ్డుకున్న రేవంత్ రెడ్డిని గద్దె దించండి. అందులో భాగంగా మీ ఇంటికి వచ్చే కాంగ్రెస్ నేతలను నిలదీయండి. మహిళా ఆక్రోశం ఏమిటో తెలిసేలా రేవంత్ రెడ్డికి చురకలు అంటించాల్సిన అవసరం ఉంది. ఇకనైనా బుద్ధి తెచ్చుకుని మహిళా బిల్లుకు మద్దతు తెలిపాలని సూచిస్తున్నా. నరేంద్రమోదీ ప్రభుత్వం ముమ్మాటికీ మహిళా పక్షపాతి. రాష్టపతిగా, ఆర్థిక మంత్రి బాధ్యతలను మహిళలకు అప్పగించడమే నిదర్శనం.

## నాదెండ్లకు మంత్రి కొండపల్లి ఘననివాళి



**విజయవాడ,ఏప్రిల్ 23 (వార్తాప్రభ) :** సమైక్యాంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కరరావు అంత్యక్రియలు గురువారం సాయంత్రం హైదరాబాద్‌లో ముగిశాయి. తెలంగాణ ప్రభుత్వ అధికారిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహ పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ నాదెండ్ల పార్థివ దేహానికి నివాళులు అర్పించడంతో పాటు నాదెండ్ల కుమారుడు మంత్రి నాదెండ్ల మనోహర్‌ను పరామర్శించారు. ఈ సందర్భంగా కొండపల్లి మాట్లాడుతూ నాదెండ్ల భాస్కరరావు లాంటి సీనియర్ రాజకీయ వేత్తను కోల్పోవడం మన దుర్భష్టకరం అని,ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఆర్థిక మంత్రిగా, ఇతర కీలక శాఖల మంత్రిగా పనిచేసినప్పుడు తన పరిపాలనా సామర్థ్యాన్ని నిరూపించుకున్నారని కొండపల్లి నాదెండ్ల సేవలను గుర్తు చేసుకున్నారు.

## ఆర్టీసీ సమ్మె.. మంత్రుల కమిటీ వేసే యోచనలో ప్రభుత్వం

- కొనసాగుతున్న తెలంగాణ ఆర్టీసీ కార్మికుల సమ్మె
- సీఎం, డిప్యూటీ సీఎంలతో పొన్నం, వివేక్ చర్చలు
- కాసేపట్లో భేటీ కానున్న కేబినెట్

**తెలంగాణ,ఏప్రిల్ 23 (వార్తాప్రభ) :** ఆర్టీసీ కార్మికుల సమ్మె సెగ సచివాలయాన్ని తాకడంతో ప్రభుత్వం వేగంగా స్పందించింది. నిన్న రాత్రి రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్, మంత్రి వివేక్ వెంకటస్వామి ముఖ్యమంత్రి, డిప్యూటీ సీఎంలతో భేటీ అయ్యి తాజా పరిస్థితులపై చర్చించారు. కార్మికులు లేవనెత్తిన 32 డిమాండ్లలో ఇప్పటికే 29 అంశాలకు ప్రభుత్వం సుముఖంగా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రధానంగా వేతన సవరణ (30 శాతం ఫిట్‌మెంట్), పెండింగ్ బకాయిలు, విలీనం వంటి కీలక అంశాలపై ఐఏఎస్ అధికారుల కమిటీ ఇచ్చిన ప్రాథమిక నివేదికను నేడు కేబినెట్ సమావేశంలో చర్చించనున్నారు. ఈ కేబినెట్ భేటీ అనంతరం సమస్యల పరిష్కారానికి ఒక మంత్రుల కమిటీని ప్రకటించే అవకాశం ఉందని సమాచారం. ఈ కమిటీ కార్మిక సంఘాలతో నేరుగా చర్చలు జరిపి సమ్మె విరమింపజేసేలా వ్యూహం రచిస్తుంది.

## మహర్షి భగీరథుని స్ఫూర్తితో జల సంరక్షణకు పెద్దపీట - కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**విజయవాడ, ఏప్రిల్ 23 (వార్తాప్రభ) :** గంగను భూమ్మీదకు తెచ్చిన మహనీయులు మహర్షి భగీరథను స్మరించుకుంటూ సామాజిక బాధ్యతగా ప్రతిఒక్కరూ జల సంరక్షణలో కీలక భాగస్వాములు కావాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. మహర్షి భగీరథ జయంతి సందర్భంగా జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో గురువారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీశ అధికారులతో కలిసి భగీరథుని చిత్రపటానికి పూల మాలలు వేసి మహనీయుని స్ఫూర్తి పథాన్ని స్మరించుకున్నారు. భగీరథుని పట్టుదల స్ఫూర్తిని స్మరించుకుంటూ ఆయన చూపిన మార్గాన్ని, అనుసరించాల్సిన అవసరాన్ని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం గౌరవ ముఖ్యమంత్రి దార్శనికతకు అనుగుణంగా ప్రస్తుతం అత్యంత ప్రతిష్టాత్మకంగా జలధార-జలహారతి కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని.. 100 రోజుల కార్యాచరణతో చేపట్టిన ఈ బృహత్తర కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. నీటి వనరులను సంరక్షించడం, వర్షపు నీటిని నిల్వ చేయడం, భూగర్భ జలాలను కాపాడుకోవడం వంటి అంశాల్లో ప్రజలందరూ చైతన్యంతో ముందుకు రావాలని కలెక్టర్ లక్ష్మీశ కోరారు. కార్యక్రమంలో డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం, జిల్లా బీసీ సంక్షేమ అధికారి ఇ.జగ్గయ్య, కలెక్టరేట్ వివిధ సెక్షన్ల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## క్యాన్సర్ ను తొలి దశలో గుర్తిస్తే చికిత్స సులభం - డాక్టర్ కౌశిక్ హరి



**గొల్లప్రోలు,ఏప్రిల్ 23 (వార్తాప్రభ) :** క్యాన్సర్ ను తొలి దశలో గుర్తిస్తే చికిత్స సులభమని క్యాన్సర్ వైద్య నిపుణులు డాక్టర్ కౌశిక్ హరి అన్నారు. కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (ది పిఎంపి అసోసియేషన్) కాకినాడ జిల్లా గొల్లప్రోలు మండలం ఆధ్వర్యంలో పిఠాపురం సూర్యరాయ గ్రంధాలయ ఆవరణలో మండల అధ్యక్షులు జీఎన్.సత్యనారాయణ అధ్యక్షత న వైద్య విజ్ఞాన అవగాహన సదస్సు జరిగింది. ఈ సదస్సులో కాకినాడ కు చెందిన ట్రినిటీ హాస్పిటల్ ఫౌండర్,సర్జికల్ ఆంకాలజిస్టు డాక్టర్ కౌశిక్ హరి ముఖ్య అతిధిగా హాజరై మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధి పట్ల పీఎంపీలు అవగాహన కల్గి ఉండాలని,క్యాన్సర్ ను ముందుగా గుర్తించగల్గితే మేలైన చికిత్స అందించి వారి ప్రాణాలను కాపాడవచ్చని అన్నారు.ప్రభుత్వం అందించే హెచ్పీవీ వ్యాక్సిన్ ను ప్రతి కుటుంబంలోని బాలికలు వేయించుకునేలా పీఎంపీలు అవగాహన కల్పించాలని కోరారు. అలాగే అవయవదానం పట్ల అపోహలును వీడి అవయవదానానికి ముందుకు రావాలని సూచించారు.ఈ కార్యక్రమం లో రాష్ట్ర గౌరవ సలహాదారు కోన చిన్నారావు,జిల్లా కార్యదర్శి ఎండి తానీషా,మండల కార్యదర్శి మడకా సత్యనారాయణ, కోశాధికారి చింతలపూడి సూర్యనారాయణ,శ్రీరామ్,కాకినాడ అధ్యక్షుడు సీహెచ్ ఏడుకొండలు, కార్యదర్శి కె. శ్రీనివాస్, కాజులూరు మండల అధ్యక్షులు జేవీవీ సూర్యనారాయణ, ఖాజా లతో పాటు సభ్యులు పాల్గొన్నారు.

## వితంతువుల జీవితాలలో వెలుగులు నింపిన కూటమి ప్రభుత్వం



**విస్సన్నపేట,ఏప్రిల్ 23 (వార్తాప్రభ) :** కూటమి ప్రభుత్వ ఆధ్వర్యంలో కొత్త వితంతు పింఛన్లు మంజూరుకు రంగం సిద్ధం కావడంతో వితంతు కుటుంబాలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు కావస్తున్న సందర్భంగా కొత్త పింఛన్లు ఇవ్వడానికి ముందుగా రావడం వితంతు కుటుంబాలకు భరోసా ఇచ్చినట్లు అయిందని అంటున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 1,53 లక్షల కుటుంబాలకు లబ్ది చేకూరనున్నట్లు తెలుస్తోంది. ఇప్పటికే దాదాపు 2.30 లక్షల మందికి పింఛన్ తీసుకునే భర్త చనిపోవడంతో భార్యకు పౌజ్ కేసు కింద నాలుగు వేల రూపాయలు ప్రతినెలా అందించడం జరుగుతుంది. అతి త్వరలో అర్హులైన దివ్యాంగులకు కూడా కొత్త పింఛన్లు ఇచ్చేందుకు రంగశే సిద్ధమవుతున్నట్లు విశ్వాసినియ వర్గాల సమాచారం అందుతుంది.



తెలంగాణ, జూబ్లీహిల్స్ శాసనసభ్యులు వల్లాల నవీన్ యాదవ్ కనకదుర్గమ్మ అమ్మవారి దర్శనం కోసం విజయవాడ వచ్చిన సందర్భంగా గన్నవరం ఎయిర్ పోర్ట్ లో స్వాగతం పలుకుతున్న అఖిల భారత యాదవ మహా సంఘం రాష్ట్ర నాయకులు బొడ్డు రమేష్ యాదవ్,అంగిరేకుల రామరాజు యాదవ్, డిల్లీ భూపతి యాదవ్ తదితర నాయకులు

**-విజయవాడ,ఏప్రిల్ 23 (వార్తాప్రభ) :**

## డీజిల్ ఎగ్జాస్ట్ ఫ్లూయిడ్ ప్లాంట్ తనిఖీ చేసిన వ్యవసాయ, రెవెన్యూ అధికారులు





**గుంటూరు,ఏప్రిల్ 23 (వార్తాప్రభ) :** గుంటూరు జిల్లా వట్టి చెరుకూరు మండలం పుల్లడుగుంట గ్రామంలో ఉన్న నందన్ పెట్రోకెమ్ లిమిటెడ్ (ఎన్.పి.ఎల్.) డీజిల్ ఎగ్జాస్ట్ ఫ్లూయిడ్ ప్లాంట్ పరిశ్రమని, జిల్లా కలెక్టర్ ఆదేశాలమేరకు సబ్ డివిజన్ సహాయ వ్యవసాయ సంచాలకులు నాగభైరు మోహన్ రావు,వట్టిచెరుకూరు మండలం తహసీల్దార్ క్షమారాణిలు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు.తనికీలలో భాగంగా సబ్సిడీ యూరియాని డైవర్షన్ కాకుండా ఉండటానికి ఈ యొక్క జాయింట్ ఇన్స్పెక్షన్ చేయటం జరిగిందని , ఈ ఎన్ పి ఎల్ కంపెనీలో బీఎస్ 6 మరియు బిఎస్ 4 వాహనాల్లో, పొల్యూషన్ తగ్గించడానికి వాడే 'యాడ్ బ్లూ 'తయారు చేయడం జరుగుతుందని, అందుకు అవసరం అయ్యే టెక్నికల్ గ్రేడ్ యూరియా (టీజీయూ) ను ఈ కంపెనీ వారు డైరెక్ట్ గా బాంబే నుండి తెప్పించుకోవటం జరుగుతుందని ,వీరు లోకల్ గా రైతులకు సంబంధించిన సబ్సిడీ యూరియాని వీరు వాడటం లేదు అని ఈ తనికీలలో తెలిసిందిని అధికారులు తెలిపారు, ఈ సందర్భంగా కంపెనీ టీజీయు కి సంబంధించిన ఇన్వాయిస్ లను, రా మెటీరియల్ ను, ఫినిషెడ్ ప్రోడక్ట్ అయిన "యాడెబ్లూ"ను పరిశీలించటం జరిగిందని అంతే కాకుండా కం పెనీ దగ్గర ఉన్న టీజీయూ యూరియా శాంపిల్ ను ల్యాబ్ కి పంపించటం జరిగిందని కూడా తెలియ చేశారు, ఈ తనికీలలో ఎన్.పి.ఎల్. కంపెనీ వారు రైతులకు సంబంధించిన, సబ్సిడరీ యూరియాని వాడుట లేదని తెలిపారు, ఈ తనికీలలో అధికారులతోపాటు స్థానిక వి ఆర్ వో, ఆర్ ఎస్ కే సిబ్బంది, కంపెనీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## మనం మాట్లాడే మాటలు సత్యం ఉండాలి

● కె.వి.ఆర్ జూనియర్ అండ్ ఒకేషనల్ కాలేజీ కరస్పాండెంట్ కే వెంకటేశ్వరరావు( కె.వి.ఆర్ )



**విస్సన్నపేట,ఏప్రిల్ 23 (వార్తాప్రభ) :** మనం నడిచే నడకలో క్రమశిక్షణ ఉండాలని మాట్లాడే మాటలు సత్యం ఉండాలని నడకలో క్రమశిక్షణ ఉండాలని మన పనీతీరులో ధర్మం ఉండాలని ఇవి అన్ని సమాజానికి అనుగుణంగా ఉండాలని కె వి ఆర్ జూనియర్ ఒకేషనల్ కాలేజీ కరస్పాండెంట్ కెవిఆర్ అన్నారు. సమాజంలో ఎందరో పేదలు దళిత గిరిజన బడుగు బలహీన వర్గాలలో ఉన్నారని దారిద్ర రేఖకు దిగువన ఉన్న వారి ఆర్థిక ఎదుగుదలకు వారి ఉన్నత ని పెంచేందుకు పేదరికం అనే గీతను చెరిపి వేసే లక్ష్యంగా ఒకేషనల్ కోర్సులను ఇంటర్మీడియట్ విద్యకు సమాంతరంగా తమ కాలేజీ ద్వారా తీసుకురావడం జరిగింది అని చెప్పారు. తొలి ప్రయత్నం లోనే తమ కళాశాల నుండి మేడ అభి లేఖ వెటర్నరీ నందు జిల్లా ఫస్ట్, బి మౌనిక అగ్రికల్చర్ జిల్లా పస్ట్, ఎస్ అఖిల్ డివిజన్ ఫస్ట్ సాధించడంతోపాటు ఓవరాల్ గా 90% రిజల్ట్ సాధించామని చెప్పాను. ఒకేషనల్ అంటేనే జాబ్ 100% గ్యారంటీ అని ఇంటర్మీడియట్ విద్యతో మరోవైపు పోటీ పరీక్షలకు కోచింగ్ ఇవ్వటంతో పాటు విదేశీ విద్యను కూడా విత్ పాస్ పోర్ట్, ఎడ్యుకేషన్ లోన్స్ సౌకర్యంతో ఒకే గొడుగు కిందకు తేవటం జరిగిందన్నారు. విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలో వేస్తామని తాము చేసిన వాగ్దానాలను కె వి ఆర్ సంస్థను నమ్మి పంపిన పిల్లలకు నూటికి నూరు శాతం న్యాయం చేసామన్నారు. జరగబోవు విద్యా సంవత్సరం నుండి ఇంటర్మీడియట్ మహిళా ప్రత్యేక క్యాంపస్ ను ఏర్పాటు చేస్తున్నామని మీడియా సమావేశంలో కెవిఆర్ తెలియజేశారు.

## ప్రభుత్వ ఉత్తర్వులు ప్రకారం వేసవి సెలవుల భద్రత చర్యలు - అవగాహనా సదస్సు

● వేసవి సెలవులను సద్వినియోగం చేసుకోండి ● హెచ్ఎం దారపురెడ్డి భాస్కరరావు



**హనుమాన్ జంక్షన్,ఏప్రిల్ 23 (వార్తాప్రభ) :** మద్దాయికుంట జడ్పీ హైస్కూల్ లో విద్యార్థులకు వేసవి సెలవులను సద్వినియోగం చేసుకునే విధానంపై గురువారం అవగాహన కల్పించారు. హెచ్ఎం దారపురెడ్డి భాస్కరరావు మాట్లాడుతూ రేపటినుండి జూన్ 11వ తేదీ వరకు వేసవి సెలవులు, జూన్ 12వ తేదీన పాఠశాలలను పునః ప్రారంభిస్తారన్నారు. జలాశయాల వద్దకు వెళ్లి ప్రమాదాలకు గురి కావద్దని హెచ్చరించారు. తల్లిదండ్రుల మాట వింటూ, సబ్జెక్టులపై పట్టు సాధించాలని సూచించారు. పెద్దలు లేకుండా ఎట్టి పరిస్థితులలో కాలువలు, చెరువులు, నదులు, సముద్రపు ఒడ్డుకు అస్సలు వెళ్ళవద్దని హెచ్చరించారు. నీటి లోతు తెలియకుండా సరదాకైనా నీటిలోకి దిగవద్దని, దీనివలన తీవ్రమైన ప్రమాదాలు సంభవిస్తాయని సోదాహరణంగా వివరిస్తూ హెచ్చరించారు. ఎండలు విపరీతంగా పెరుగుతున్న తరుణంలో వడదెబ్బకు గురి కాకుండా తగిన జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. పెద్దలకు సాయం చేస్తూ ఎలాంటి పని ఉన్నప్పటికీ మధ్యాహ్నం 12 గంటల లోపు ఇళ్లకు చేరుకొని, సకాలంలో భోజనం చేసి విశ్రాంతి తీసుకోవాలన్నారు. సాయంత్రం నాలుగు గంటల లోపు ఇళ్ల నుండి ఏ ఒక్కరు బయటకు రాకూడదని తెలిపారు. వేసవిలో దాహం ఎక్కువగా ఉంటుందని, ఒకవేళ దాహం వెయ్యకపోయినప్పటికీ అధిక సంఖ్యలో నీటిని, మజ్జిగ, కొబ్బరి నీరు తీసుకోవడం ఎంతో మేలు అన్నారు. వడదెబ్బ సూచనలు కనిపిస్తే తక్షణమే సమీపములోని ప్రభుత్వ ఆసుపత్రులకు తరలిస్తే మేలైన వైద్య సేవలు అందించడం ద్వారా తక్షణమే కోలుకుంటారని అన్నారు. వేసవి సెలవల్లో సమయం వృధా కాకుండా ప్రణాళికతో ముందడుగు వేయాలన్నారు. ప్రస్తుత తరుణంలో కొద్దిపాటి సమయం లభిస్తే వయోభేదం లేకుండా ఎవ్వరైనా చేతిలోకి స్మార్ట్ ఫోన్ తీసుకుని ప్రపంచాన్ని చుట్టేయడమే కాక, ప్రపంచాన్ని సైతం మరచిపోయి మరో లోకంలో విహరించడం చూస్తూనే ఉన్నామని అన్నారు. ఇది ఏ మాత్రం విద్యార్థి దశలో సరికాదని హెచ్చరించారు. మంచి కథలను, నీతి కథల పుస్తకాలను చదువుకోవాలన్నారు. డ్రాయింగ్, పెయింటింగ్, సాయంత్రం వేళల్లో ఆటలు, ఇష్టమైన ఎన్నో సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొనడం ఎంతో మేలు అన్నారు. రానున్న విద్యా సంవత్సరానికి సిద్ధం అయ్యేలా బోధన పుస్తకాలను పరిశీలించి చదువుకుంటూ, సమస్యలను నివృత్తి చేసుకోవాలన్నారు. జూన్ 12వ తేదీ పాఠశాల పునః ప్రారంభం అయ్యేనాటికి విద్యార్థులు ఎంతో హుషారుగా, సంతోషంగా, ఆరోగ్యంగా ఉండేలా చూసుకోవాలన్నారు. తల్లిదండ్రుల మాట వింటూ, తల్లిదండ్రులను గౌరవిస్తూ ముందడుగు వేస్తే క్రమశిక్షణతో కూడిన బంగారు భవిత విద్యార్థుల సొంతం అవుతుందని వివరించారు.

## జనభా గణనకు ప్రజలందరూ సహకరించాలి - తహసిల్దార్ ఆంజనేయ రెడ్డి





**గిద్దలూరు, ఏప్రిల్ 23 (వార్తాప్రభ) :** భారత ప్రభుత్వం,జిల్లా యంత్రాంగం ఆదేశాల మేరకు జనభా గణన-2027 ప్రక్రియపై ఎన్యుమరేటర్లకు, సూపర్వైజర్లకు మూడు రోజుల పాటు సమగ్ర శిక్షణా కార్యక్రమం గురువారం గిద్దలూరులోని ఎంపీడీవో కార్యాలయం నందు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గిద్దలూరు మండల తహసిల్దార్ (ఛార్జ్ ఆఫీసర్) ఆంజనేయ రెడ్డి అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాబోయే 2027 జనభా గణన దేశంలోనే మొట్టమొదటి పూర్తిస్థాయి డిజిటల్ సెన్సస్ అని, దీనిని అత్యంత ఖచ్చితత్వంతో నిర్వహించాలని సిబ్బందిని ఆదేశించారు. శిక్షణలోని ప్రధానాంశాలను వివరిస్తూ డిజిటల్ "హౌస్ లిస్టింగ్ ఆపరేషన్స్" మొబైల్ యాప్ వినియోగంపై పూర్తిస్థాయి అవగాహన కల్పించారు. డేటాను ఆన్లైన్లో నమోదు అంశాలపై ప్రత్యక్ష ప్రదర్శన ఇచ్చారు. గృహ గణనలో భాగంగా ఇంటి పరిస్థితి, ఇంట్లోని వసతులు, ఆస్తుల వివరాలను సేకరించే 34 రకాల ప్రశ్నలపై వివరణ ఇచ్చారు. స్వీయ గణన ప్రజలు తమ వివరాలను తామే ఆన్లైన్లో నమోదు చేసుకునే 'సెల్ఫ్ ఎన్యుమరేషన్' విధానం గురించి సిబ్బందికి వివరించారు. ప్రతి ఇంటిని సందర్శించి, ఏ ఒక్క కుటుంబాన్ని వదలకుండా వివరాలు సేకరించాలని సూచించారు. సూపర్వైజర్లు అందరూ తమ పరిధిలోని ఫీల్డ్ వర్క ను హెచ్.యల్. ఓ యాప్ ద్వారా నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. జాతీయ ప్రాముఖ్యత కలిగిన ఈ పనిని ఖచ్చితత్వంతో చేయాలని ఆదేశించారు. ఈ శిక్షణ కార్యక్రమాన్ని మూడు రోజులపాటు సమర్థవంతంగా నిర్వహించిన మాస్టర్ ట్రైనీలు డాక్టర్ మొర్రి. పిచ్చయ్య, యం. బాల గురవయ్య, రామచంద్రా రెడ్డి లను అభినందించి దుశ్శాలువతో, గిఫ్ట్ తో సన్మానించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ భాస్కర రావు, మండల అసిస్టెంట్ స్టాటిస్టిక్స్ ఆఫీసర్ ఎం.డి ఫరీదా, రెవిన్యూ సిబ్బంది పాల్గొని శిక్షణ తరగతులు సజావుగా జరగడానికి సహకరించారు. జనభా గణన 2027 విజయవంతం కావడానికి గిద్దలూరు మండల ప్రజలు తమ వద్దకు వచ్చే అధికారులకు సరైన సమాచారం అందించి సహకరించాలని మండల తహసిల్దార్ ఆంజనేయ రెడ్డి కోరారు.

## ఓసి జనరల్ స్థానానికి జగన్ ఆశీస్సులు ఆయనకేనా?



**విస్సన్నపేట,ఏప్రిల్ 23 (వార్తాప్రభ) :** ఎన్టీఆర్ జిల్లాలో ఓసి జనరల్(2029) అసెంబ్లీ స్థానాలలో ఒక నియోజకవర్గం నాకు విజయ భాస్కర రెడ్డి పోటీ చేసే అవకాశం ఉంటుందని విశ్వసనీయ వర్గాల సమాచారం అందుతోంది. ప్రతిక్షణం జనం నాలుకపై నాట్యం ఆడే పేరు ఎన్టీఆర్ జిల్లా రెడ్డిగూడెం మండలం మద్దులపర్వ భాస్కర రెడ్డి. ఆయన సుదీర్ఘ కాల రాజకీయ అనుభవం కలిగిన పాలంకి పుల్లారెడ్డి కుమారుడు అత్యున్నత స్థాయి రాజకీయ సామాజిక ఆర్థిక సాంకేతికత పట్ల అనుభవజ్ఞులు మేధావులతో ప్రత్యక్ష పరిచయాలు ఉండటంతో పాటు రాజకీయాలలో మాట తప్పని మడిమతిప్పని వ్యక్తిగా ఓడ ఎక్కాక ఒక మాట ఓడ దిగాక మరి ఒక మాట చెప్పకుండా వైసీపీ జెండా మోసే ప్రతి ఒక్క కార్యకర్తకు వెన్నుదన్నుగా తానున్నానని ధైర్యం చెబుతూ విజయ భాస్కర రెడ్డి అంటే విక్టరీకి మారుపేరుగా కార్యకర్తల మనోభావాలకు అద్దం పడుతూ ముందుకు వెళ్లడం జరుగుతుంది. రాబోయే కాలంలో కాబోయే ఎమ్మెల్యే మా భాస్కర్ రెడ్డి అని ఆయన అభిమానులు అనుకుంటున్నారు. తనను నమ్మిన వారిని నేడు కాకపోతే రేపైనా అందలమెక్కించే వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైయస్ రాజశేఖర రెడ్డి తనయుడు వై ఎస్ జగన్ మోహన రెడ్డి ఆశీస్సులతో ప్రజల దీవెనలతో అసెంబ్లీకి వెళ్లి అధ్యక్ష అని తన వాణి వినిపించేందుకు అవకాశం ఇచ్చే పరిస్థితి ఉందని తెలుస్తోంది.

## మాజీ డిప్యూటీ మేయర్ సత్యం ఇంటికి తెలంగాణ ఎమ్మెల్యే నవీన్ రాక



**విజయవాడ, ఏప్రిల్ 23 (వార్తాప్రభ) :** తెలంగాణ రాష్ట్రం జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే వి నవీన్ యాదవ్ భీమవరంలో సాయిబాబా గుడి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమానికి వెళ్తూ మార్గమధ్యంలో విజయ వాడ మాజీ డిప్యూటీ మేయర్, అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు వెంకట సత్యనారాయణ ఇంటివద్ద అల్పాహారం విందుకు హాజరైన వారు. ఈ సందర్భంగా యువ నేత డాక్టర్ చరణ్ పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో మర్యాద పూర్వకంగా కలిసిన వారిలో అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర జనరల్ సెక్రటరీ పెద్దిబోయిన శ్రీనివాస్ యాదవ్, మాజీ కార్పొరేటర్లు వియ్యపు అమర్నాథ్ యాదవ్, ఎర్రగొర్ల శ్రీరాములు యాదవ్,రామవరప్పాడు ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం చైర్మన్ గోగం బాల కోటేశ్వర రావు యాదవ్, అయితా కిషోర్ యాదవ్,కొంగన రవి కుమార్, కరగాన రాజు, గోళ్ళ రాజు యాదవ్, తట్టుకోళ్ల శివ యాదవ్, గౌరిపర్తి మాధవరాజు యాదవ్, బత్తుల కాశి విశ్వనాథ్ యాదవ్, అక్కల విష్ణు యాదవ్,పిల్లల రాజా యాదవ్, రామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ ఐకాప్స్ నిర్వహణకు సీబీసీ టెండరు

**విజయవాడ(పి.బి.ఐ.), ఏప్రిల్ 23 (వార్తాప్రభ) :** కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు ప్రధాన పథకాలు, వివిధ అభివృద్ధి కార్యక్రమాలు మరియు ఇతివృత్త ఆధార అంశాల మీద సమీకృత సమాచార మరియు ప్రచార కార్యక్రమం ( ఐసిఓపి) నిర్వహించడానికి కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖకు చెందిన సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్ (సి బి సి) టెండర్లు ప్రకటించింది. కేంద్ర ప్రభుత్వ నిబంధనల మేరకు అర్హులైన ఈవెంట్ మేనేజ్ మెంట్ సంస్థల నుంచి కొటేషన్లను మే నెల 5వ తేదీ వరకు స్వీకరిస్తున్నట్టు సీబీసీ డైరెక్టర్ జి సురేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సీబీసీ ప్రకటించిన ఎంపానెల్ మెంట్ వివరాలు, టెండర్ ప్రక్రియలో పాల్గొనే సంస్థలకు కావలసిన అర్హతలు, ఇతర నిబంధనలను https://eprocure.gov.in/epublish/app లో టెండర్ ఐడి 835410బి2 ద్వారా లేదా https://cbcindia.gov.in/ పోర్టల్ లో ప్రచురించిన టెండర్ నోటీసులో కూడా పొందవచ్చని ఆయన తెలిపారు. ఎంపానెల్ మెంట్ ద్వారా ఎంపికైన సంస్థలు ఈ ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రంలో వివిధ ప్రాంతాలలో కేంద్ర ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలపై ప్రచార కార్యక్రమాలు, ప్రదర్శనలు, సదస్సులు నిర్వహించ వలసి ఉంటుందని సురేష్ కుమార్ తెలిపారు. సూక్ష్మ, చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమల (ఎమ్మెస్ ఎం.ఈ.) కింద నమోదైన సంస్థలకు నిబద్ధత సొమ్ము (ఈఎండి) నుంచి మినహాయింపు ఉంటుందని తెలిపారు. కనిష్ఠ ధర పలికిన సంస్థకు ఇచ్చే అరవై శాతం పనులు పోను, టెండరు ప్రక్రియలో విజయవంతంగా పాల్గొన్న సంస్థలన్నింటికీ మిగిలిన పనిని సమానంగా చేసే అవకాశం కల్పిస్తామని తెలిపారు. సంస్థల పనితీరును బట్టి, పరస్పర అంగీకారంపై ఎంపానెల్ మెంట్ మరో ఏడాది పొడిగించే అవకాశం కూడా ఉంటుందని చెప్పారు. ఈనెల 30వ తేదీన ప్రీబిడ్ సమావేశం నిర్వహించి టెండర్ ప్రక్రియలో పాల్గొనే సంస్థలకు ఐసిఓపి కార్యక్రమాల వివరాలు, సంస్థల బాధ్యతలను వివరిస్తామని తెలిపారు. రాష్ట్రంలో నమోదైన, ఆసక్తిగల సంస్థలు టెండరు ప్రక్రియలో పాల్గొనాలని సురేష్ కుమార్ విజ్ఞప్తి చేసారు.

## పల్లెకు పోదాం -పాడిని చూద్దాం



**గుడ్లవల్లేరు,ఏప్రిల్ 23 (వార్తాప్రభ) :** ది 23.04.26 తేది ఉదయం 7:00 గంటలకి పామర్రు క్లస్టర్ గుడ్లవల్లేరు పాలసీతలీకరణ కేంద్రం పరిధిలో ఉన్న మండవల్లి మండలం పెరికే గూడెం, లింగాల పాల ఉత్పత్తిదారుల పరస్పర సహాయక సహకార సంఘంలో గురువారం" పల్లెకి పోదాం పాడిని చూద్దాం" కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న చైర్మన్ చలసాని ఆంజనేయులు రైతులకు 10 వెన్న శాతం కు 85/ రూపాయల పాల ధరతో పాటుగా ప్రతి 4 నెలలకు 10% బోనస్ తో 93. 50 / దేశంలోనే అత్యధిక ధర చెల్లిస్తున్నాం అని తెలియజేశారు పశువులకు చూడి నిర్ధారణ చేసే "సిబిటి కిట్ల "పనితీరు 'తిరగ పోల్లె ' పశువుల గర్భం పరిస్థితి ఏ విధంగా ఉందో తెలియజేసే" ఏ ఐ" గన్ వినియోగం గురించి తెలిపారు. మరియు యూనియన్ రైతులకు అందించే సౌకర్యాలను వినియోగించుకోవాలని తెలియజేశారు. 2024- 25 ఆర్థిక సంవత్సరంలో యూనియన్ వారి మూడో విడత బోనస్ పంపిణీ కార్యక్రమంలో అత్యధికంగా పాలు పోసిన రైతులను చైర్మన్ చలసాని ఆంజనేయులు గారు శాలువాతో సత్కరించడం జరిగినది ఈ కార్యక్రమంలో కృష్ణ మిల్క్ యూనియన్ పాలకవర్గ సభ్యులు మరియు పెదన్నరాజ సభ్యులు శ్రీ అర్జ వెంకట నగేష్ గారు పెరికే గూడెం సంఘం అధ్యక్షులు బాదిన వెంకన్నబాబు, లింగాల సంఘ అధ్యక్షులు పోలగాని శ్రీరామ్మూర్తి, వెటర్నరీ డిడి లింగం ప్రసాద్ గారు, మేనేజర్ చిట్టూరి దామోదర కృష్ణ గోపీనాథ్ గారు, వెటర్నరీ డాక్టర్ శివరామకృష్ణ గారు, సూపర్వైజర్ బసవరాజ కుమార్, సెమన్ వర్కర్ నాగేశ్వరరావు, వెటర్నరీ సిబ్బంది, పాల ఉత్పత్తిదారులు, వేతన కార్యదర్శులు మరియు పలువురు గ్రామ పెద్దలు పాల్గొనడం జరిగింది

## సెన్సస్ అవేర్నెస్ మెడల్స్ అందజేత...



**కృత్తివెన్ను,ఏప్రిల్ 23 (వార్తాప్రభ) :** కృష్ణా జిల్లా కలెక్టర్ మరియు ప్రిన్సిపల్ సెన్సెస్ ఆఫీసర్ వారి ఆదేశానుసారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నందు విద్యార్థులకు 2027 స్కూల్ అవేర్నెస్ యాక్టివిటీస్ లో భాగంగా క్విజ్ , వక్తృత్వ మరియు వ్యాసరచన పోటీలు నిర్వహించడం జరిగింది. విజేతలైన విద్యార్థులకు సెన్సెస్ ఆఫీసర్ ద్వారా పాఠశాలకు అందజేసిన మెడల్స్ ను విద్యార్థులకు బహుకరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి 2 ఎస్ కే డి వి ప్రసాదరావు, ప్రధానోపాధ్యాయులు టీవీ ప్రసాదు, కొప్పినీడి సూర్య ప్రకాష్, ఏసు పాదం మురళీకృష్ణ ప్రభ త్రివేణి రేఖ దుర్గా జ్యోతి మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

వార్తా ప్రభ
హైదరాబాద్

## అనుమతి లేని ఆసుపత్రులపై కొరడా!!



**పెద్దపల్లి/ గోదావరిఖని: ఏప్రిల్ 23 (వార్తాప్రభ ప్రతినిధి)** రామగుండంలో కంటి ఆసుపత్రులపై మెరుపు దాడులు నిర్వహించినట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కె. ప్రమోద్ కుమార్ తెలిపారు. తనిఖీల్లో భాగంగా అనుమతులు లేని రెండు ఆసుపత్రులను గుర్తించి నోటీసులు జారీ చేశామన్నారు. క్లినికల్ ఎస్టాబ్లిష్మెంట్ యాక్ట్–2010 ప్రకారం ఆసుపత్రులు, డయాగ్నొస్టిక్ సెంటర్లు, స్కానింగ్, ఫిజియోథెరపీ కేంద్రాలు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని స్పష్టం చేశారు. అలాగే, ఆప్టికల్ దుకాణాలు కంటి పరీక్షలు నిర్వహించడం చట్టరీత్యా నేరమని, కేవలం ప్రిస్క్రిప్షన్ మేరకు అద్దాలను మాత్రమే విక్రయించాలని ఆయన హెచ్చరించారు. నిబంధనలను అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా ఆయన హెచ్చరించారు.

## కె. ఎల్ . ఆర్. జన్మదిన సందర్భంగా బస్తీ పిల్లలతో ఇంటిల్లి పాది పండుగగా జరుపుకున్న షర్మిల కాలేష



**జవహర్ నగర్, ఏప్రిల్ 23:(వార్తా ప్రభ)**కీసర సర్కిల్, జవహర్ నగర్ జిహెచ్ఎంసి పరిధిలో గల బడుగు బలహీన వర్గాల, ఆశాజ్యోతి ప్రియతమ నాయకులు, మేడ్చల్ నియోజకవర్గం మాజీ శాసనసభ్యులు, ప్రస్తుత మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి మరియు సామాజిక స్పృహ కలిగిన మహోన్నతమైన వ్యక్తి కిచ్చన్న లక్ష్మారెడ్డి 70 వ జన్మదిన టీ కాలేష, షర్మిల దంపతులు, బస్తి పిల్లల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. జవహర్ నగర్ ముస్లిం కమిటీ కార్యదర్శి మరియు కాంగ్రెస్ (ఐ) పార్టీ నాయకులు టీ కాలేష, అతని సతీమణి షర్మిల ఆధ్వర్యంలో పిల్లలకి పండ్లు, పలహారాలు పంపిణీ చేశారు. కేక్ కట్ చేయించి, కె. ఎల్ .ఆర్ కు 70 వ జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. కె. ఎల్. ఆర్ ఆయు ఆరోగ్యాలతో మరెన్నో పుట్టినరోజులు జరుపుకోవాలని హాజరైన పిల్లలు దేవుళ్ళతో సమానమని పిల్లల సంతోషం ఆ చిరునవ్వులు దేవుళ్ళ దీవెనలు గా గుర్తు చేసుకున్నారు . ది :23-04-2026 గురువారం రోజున స్థానిక జవహర్ నగర్ జిహెచ్ఎంసి సుక్కమ్మ బస్తీలోని తమ నివాసంలో ఈ కార్యక్రమం జరిగింది. మృదు స్వభావి, స్నేహశీలి, పీడిత వర్గాల ఆశాజ్యోతి కె. ఎల్ .ఆర్ .కష్టించే వాడికే తినే హక్కు ఉంటుందనే కె.ఎల్.ఆర్ ఆలోచనకు అభిమానిగా మారానని అందుకే ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా ఆయన పుట్టినరోజును తన కుటుంబ సభ్యులతో జరుపుకోవడం ఆనవాయితీగా మారిందని ఈరోజు తమ ఇంటిల్లి పాదికి పండుగ రోజు అని టీ కాలేష గుర్తు చేశారు. ఆయన రాజకీయంగా మరింత ఎత్తుకు ఎదగాలని కోరారు. మానసికంగా శారీరకంగా దృఢంగా ఉండేటట్లు ప్రజల ఆదరణ అభిమానం వారి ఆశీస్సులు ఎల్లవేళలా ఉండాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో బస్తీ నివాసులతోపాటు, పెద్దలు చిన్నలు పిల్లలు కుటుంబ సభ్యులలో షేక్ ముత్తుజ హైదర్, షేక్ అజ్మతుల్ హైదర్, నూర్జైన్ ఫాతిమా, సమీనా, సమ్రీన్, జుబేరియా, ఉబేద్, ధన్విక, నిషి, రేవతి, అభిషేక్, అక్షిత తదితరులు పాల్గొన్నారు.

## దళిత రత్న అవార్డు గ్రహీత వినయ్ కు సన్మానం



**మల్కాజిగిరి ఏప్రిల్ 23 :(వార్తా ప్రభ ప్రతినిధి):** దళిత రత్న అవార్డు గ్రహీత వినయ్ ను గురువారం ఎస్సీ, ఎస్ టీ, బీసీ అంబేద్కర్ ఫ్యామిలీ ఆధ్వర్యంలో హనుమాన్ పేట కమ్యూనిటీ హాల్ లో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వినయ్ సతీమణి శాంతా భాయి దయాకర్, ఏవీ స్వామి, శంకర్ రావు, సుజాత, ప్రవీణ్ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## బంధాల బరువు... మనవాళ్ళ ముసుగు!!




కష్టంలో తోడుగా
నిలిచేది మనవాళ్ళే
నష్టంలో చేయూత
ఇచ్చేది మనవాళ్ళే
బాధలో భరోసా
నింపేది మనవాళ్ళే
మనసుకు మధురం
పంచేది మనవాళ్ళే!!
అయితే అదే
మనవాళ్ళు మారిపోతే?
మాటల్లో మాయలు దాచిపెడితే?
నవ్వుల్లో నిప్పులు దాగిపోతే?
మనసులో మోసం పెరిగిపోతే?!!
నమ్మకం నిండిన హృదయం
పగులుతుంది
అనుబంధం ఒక్క
క్షణంలో కరుగుతుంది
చేసిన సాయం
అన్నీ మాయమవుతాయి
చూసిన కలలు
నేలమట్టం అవుతాయి!!
నాశనం కోరే నీడలుగా మారితే
నడిచిన దారి కత్తులుగా మారితే
అడుగడుగునా
గాయాలు మిగులుతాయి
ఆత్మలో గాఢమైన
ముద్రలు పడతాయి!!
కానీ మనసు మళ్లీ నిలబడాలి
బలంగా జీవితం ముందుకు
సాగాలి
నిజమైన మనవాళ్ళు
ఎప్పుడో వస్తారు
నమ్మకానికి కొత్త
వెలుగు నింపుతారు!!

**గడ్డం సంతోష్ రాజ్**
గోదావరిఖని, 9849555485

# అభివృద్ధికి ప్రజల సహకారం అవసరం!!- మేయర్



**పెద్దపల్లి/ గోదావరిఖని: ఏప్రిల్ 23 (వార్తాప్రభ ప్రతినిధి)** రామగుండం నగర అభివృద్ధికి ప్రజల సహకారం అత్యంత అవసరమని మేయర్ మహంకాళి స్వామి అన్నారు. గురువారం 38వ డివిజన్ మల్లిఖార్జున్ నగర్‌లో డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య, కార్పొరేటర్ నెలకంటి రాముతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా నగరాన్ని శుభ్రంగా, సుందరంగా తీర్చిదిద్దడంలో ప్రతి ఒక్కరూ బాధ్యతగా పాల్గొనాలని సూచించారు. తక్కువ ఖర్చుతో ఇంటి వద్ద నుంచే చెత్త సేకరణ సౌకర్యం అందుబాటులో ఉన్నప్పటికీ కాలువలు, రహదారులపై చెత్త వేయడం అనారోగ్యానికి దారి తీస్తుందని హెచ్చరించారు. బహిరంగంగా చెత్త వేయడం వల్ల దోమలు, ఈగలు పెరిగి వ్యాధులు వ్యాప్తి చెందే ప్రమాదం ఉందని తెలిపారు. ప్రజల అవసరాలకే ప్రాధాన్యం ఇస్తూ పారదర్శకంగా పనులు నిర్వహిస్తున్నామని, అవినీతికి ఆస్కారం లేకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. నాలాల పూడిక తొలగింపు పనులను మునిసిపల్ సిబ్బందితోనే చేపట్టి ఖర్చులను తగ్గిస్తున్నామని వివరించారు. ఈ సందర్భంగా నాలాల శుభ్రత పనులను పరిశీలించి, రహదారుల పక్కనున్న మొక్కలు, చెట్ల కొమ్మలను తొలగించారు. రహదారికి అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లను మార్చాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పాడైన స్తంభాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని సూచించారు. నాలాల్లో వాహనాలు సులభంగా వెళ్లేందుకు ర్యాంపులు నిర్మించాలని ఇంజనీరింగ్ సిబ్బందికి తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

# ఆర్టీసీ సమ్మె దెబ్బ!!

- బస్టాండ్‌లో ఆటోల మయం
- ప్రయాణికుల అవస్థలు
- అదును చూసి రేట్లు చుక్కల్లో
- ప్రత్యామ్నాయం కోసం ప్రయాణికుల పాట్లు





**పెద్దపల్లి/ గోదావరిఖని: ఏప్రిల్ 23 (వార్తాప్రభ ప్రతినిధి)**రామగుండం బస్టాండ్ గురువారం ఉదయం నుంచి ప్రయాణికులతో కిక్కిరిసిపోయింది. ఆర్టీసీ కార్మికుల సమ్మె రెండో రోజుకు చేరడంతో బస్సులు డిపోలకే పరిమితమయ్యాయి. దీంతో దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన ప్రయాణికులు బస్టాండ్‌లోనే పడిగాపులు కాస్తున్నారు. వేసవి సెలవులు మొదలవడంతో పాఠశాలలు, కళాశాలలు మూతపడటంతో రద్దీ మరింత పెరిగింది. పిల్లలతో కుటుంబసమేతంగా ఊళ్లకు వెళ్లేవారి సంఖ్య భారీగా కనిపిస్తోంది. సమయానికి బస్సులు లేకపోవడంతో చిన్నారులు, వృద్ధులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బస్టాండ్ ఆవరణ మొత్తం ఆటోలు, ప్రైవేటు వాహనాలతో నిండిపోయింది. ఆటో డ్రైవర్లు అవకాశాన్ని అందిపుచ్చుకుని సాధారణ ఛార్జీల కంటే రెట్టింపు వసూలు చేస్తున్నారు. కరీంనగర్, పెద్దపల్లి, మంచిర్యాల వెళ్లే వారు షేర్ ఆటోలను ఆశ్రయిస్తున్నారు. కొందరు ప్రయాణికులు ఏడు సీటర్ ఆటోల్లో పది మందికి పైగా ఇరుక్కుని ప్రయాణిస్తున్నారు. మరికొందరు తమ బంధువులు, స్నేహితుల ద్విచక్ర వాహనాలు, కార్లలో లిఫ్ట్ అడుగుతున్నారు. ప్రైవేటు ట్రావెల్స్ బస్సుల యాజమాన్యాలు కూడా టికెట్ రేట్లు అమాంతం పెంచేశాయి. రైల్వే స్టేషన్ వైపు కూడా ప్రయాణికులు పెద్ద సంఖ్యలో తరలివెళ్తున్నారు. దీంతో రైళ్లలో రిజర్వేషన్ లేని బోగీలు పూర్తిగా నిండిపోతున్నాయి. సమ్మె నేపథ్యంలో పోలీసులు బస్టాండ్ వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు. అధిక ఛార్జీలు వసూలు చేస్తున్న ఆటోలు, ప్రైవేటు వాహనాలపై అధికారులు తనిఖీలు చేస్తున్నారు. ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు. అయితే క్షేత్రస్థాయిలో మాత్రం ఆ చర్యలు అంతగా కనిపించడం లేదని ప్రయాణికులు వాపోతున్నారు. సమ్మె త్వరగా విరమిస్తే తమ పిల్లలతో సురక్షితంగా గమ్యం చేరగలమని పలువురు ఆశాభావం వ్యక్తం చేశారు. వేసవి ఎండల తీవ్రత, సమ్మె ప్రభావం కలిసి సామాన్య ప్రయాణికుడి సహనానికి పరీక్షగా మారాయి.

# దద్దరిల్లిన "దరువు జాతర"

- విద్యార్థి అమరవీరుల స్మారక స్తూపాన్ని ఉస్మానియా యూనివర్సిటీలో నిర్మిస్తాం : జూపల్లి కృష్ణారావు
- వేలాదిగా తరలివచ్చిన కళాకారులు ఉద్యమకారులు
- ఆకట్టుకున్న సాంస్కృతిక ప్రదర్శనలు
- తెలంగాణ ఉద్యమాన్ని తలపించిన దరువు జాతర.







**హైదరాబాద్, ఏప్రిల్ 23, (వార్తాప్రభ)** సిద్దిపేట డిగ్రీ కళాశాలలో 1999 లో పిడికెడు మందితో మొదలైన దరువు కళాబృందం తెలంగాణ ఉద్యమంలో కీలకమైన పాత్ర వహించినదని పలువురు వక్తలు కొనియాడారు. దరువు తెలంగాణ సాంస్కృతిక చైతన్య వేదిక ఏర్పడి 25 సంవత్సరాలు నిండిన సందర్భంగా రవీంద్రభారతిలో రజతోత్సవ వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన టూరిజం సాంస్కృతిక మరియు ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ దరువు కళాబృందం అంటేనే తెలంగాణ రాష్ట్రంలో మంచి పేరున్న సంస్థ అని తెలంగాణ ఉద్యమంలో వీరోచితమైన పోరాటపటిమ చూపిన సంఘమని తెలంగాణ ఉద్యమాన్ని తమ ఆటపాటలతో ఉత్తేజపరిచి తెలంగాణ ప్రజలు నష్టపోయిన వైనాన్ని తెలంగాణ రావడం వల్ల వచ్చే లాభాలు కళ్ళకు అద్దినట్లు తమ సాంస్కృతిక ప్రదర్శన ద్వారా చూపించారని అన్నారు. దరువు వ్యవస్థాపకులు దరువు ఎల్లన్న దరువు రాష్ట్ర అధ్యక్షులు దరువు అంజన్న ఈ సంఘానికి రెండు కళ్ళ లాంటి వారిని కొనియాడారు, తెలంగాణ సాధించుకోవడంలో విద్యార్థుల పాత్ర ముఖ్యమైనదని అందులో ఉస్మానియా యూనివర్సిటీ ప్రధాన భూమిక పోషించిందని అందువల్ల త్వరలో ఉస్మానియా యూనివర్సిటీలో విద్యార్థి అమరవీరుల స్మారక స్తూపాన్ని ప్రభుత్వం ఏర్పాటుకు కృషి చేస్తుందని మంత్రి జూపల్లి కృష్ణారావు హామీ ఇచ్చారు, దరువు ప్రతినిధులు దరువు ఎల్లన్న దరువు అంజన్న ప్రజా కళలను బతికించుకుందామనే సదుద్దేశంతో ఒక రీసెర్చ్ సెంటర్ ని నిర్మించాలని కోరగా తప్పకుండా ప్రభుత్వం తరఫున నిర్మిస్తామని హామీ ఇచ్చారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన తెలంగాణ ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం తెలంగాణ ఉద్యమంలో అసువులు బాసిన అమరుల స్మారకార్థం ఒక రోజును అమరవీరుల స్మారక దినంగా అధికారికంగా ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు, తెలంగాణ యూనియన్ అఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ రాష్ట్ర అధ్యక్షులు విరాహత్ అలీ మాట్లాడుతూ దరువు కళాబృందంతో తనకు 25 ఏళ్ల సంబంధం ఉందని దరువు అంజన్న తమ గజ్వేల్ ప్రాంతంలో ఎన్నో ప్రజా ఉద్యమాలలో పాల్గొన్నారని గుర్తు చేశారు, దరువు కళాబృందం యూనివర్సిటీలో తెలంగాణ ఉద్యమానికి ఒక దిక్సూచిగా నిలిచిందని ఎల్లన్న అంజన్న చేసిన త్యాగాలను గుర్తు చేశారు. అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య జాతీయ అధ్యక్షురాలు విమలక్క మాట్లాడుతూ అంజన్న, ఎల్లన్న తమ ఇంటి పేరుని దరువుగా మార్చుకున్నారని, వీరిద్దరితో తెలంగాణ ఉద్యమంలో చాలా వేదికలు పంచుకున్నామని, విద్యార్థి ఉద్యమకారులుగా వీరిద్దరూ ఎంతో త్యాగం చేశారని వారి త్యాగం వెలకట్టలేనిది అదేవిధంగా కళాకారుల జీవితాల్లో సైతం వెలుగు నింపడానికి అనునిత్యం పోరాడుతున్నారని పొగిడారు. ఎమ్మెల్యే వేముల వీరేశం మాట్లాడుతూ దరువు కళాబృందం లేకుంటే తాను ఎమ్మెల్యే అయ్యే వాడిని కాదని దరువు కళాబృందం నుండి వచ్చిన పాటలు విని సామాజిక స్పృహని మరింత పెంచుకున్నానని తన జీవితంలో దరువు సంస్థను మర్చిపోను అని అన్నారు. బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనువాస్ గౌడ్ మాట్లాడుతూ అణగారిన బడుగు బలహీన వర్గాలు ఆటపాటలకు మాత్రమే పరిమితం కావద్దని రాజ్యాధికారం దిశగా ప్రయాణం సాగించాలని అప్పుడే వెలివాడ ప్రజల్లో వెలుగులు నిండుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు,దరువు ఎల్లన్న రాసిన నూటికి 85 కూటికి లేని వాళ్ళు కూడితె రాజ్యమన్నాడే మాన్య కాన్షిరాము అనే పాట తనకు ఇన్స్పిరేషన్ అని అన్నారు. తెలంగాణ ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ ప్రీతం మాట్లాడుతూ దరువు అంటేనే పేద కళాకారుల ఆదరువు అని ఉస్మానియా ఉద్యమంలో దరువు కళాకారుల త్యాగాలను చూసి చలించిపోయేవాడిని నేడు అదే కళాబృందంతో కలిసి వేదిక పంచుకోవడం సంతోషంగా ఉందని అన్నారు, తెలంగాణ సాంస్కృతిక సారధి చైర్మన్ వెన్నెల గద్దర్ మాట్లాడుతూ దరువు కళాబృందం దరువు బ్రదర్స్ దరువు ఎల్లన్న దరువు అంజన్న అంటే కళా రంగంలో తనకు ఇష్టమని అందుకే వారిపై ఒక పాట రాశానని ఆ పాటను సభికులకు వినిపించి ఆలోచింప చేశారు, తెలంగాణ సెక్రటేరియట్ ఎంప్లాయిస్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు పద్మాచారి మాట్లాడుతూ దరువు కళాబృందం ఇప్పటికి చేసిన కృషి చాలా అయినప్పటికీ భవిష్యత్తులో కళాకారుల గురించి ఇంకా ఎంతో చేయాల్సి ఉందని ఇప్పుడు ఉన్న ప్రభుత్వం మంత్రి జూపల్లి విశాల హృదయాలని అందుకే ఈ సమయంలో కళాకారులకు సేవ చేసే ప్రయత్నం చేయాలని అన్నారు, ఈ సందర్భంగా దరువు ప్రచురించిన ఓ యుద్ధం, వీరులారా వందనం,పాట ముచ్చట, అనే మూడు పుస్తకాలను ఆవిష్కరించడం జరిగింది. కేంద్ర సాహిత్య అకాడమీ యువ పురస్కార గ్రహిత పసునూరి రవీందర్ మాట్లాడుతూ దరువు ఎల్లన్న దరువు అంజన్న ఎక్కడ అన్యాయం జరిగినా అక్కడ ఉంటారని వారు స్వార్థం లేని కళానేతలని వారితో కలిసి తెలంగాణ ప్రభుత్వం సాంస్కృతిక శాఖ సలహా మండలి సభ్యులుగా ఉండడం ఆనందంగా ఉందని అన్నారు, తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర చైర్మన్ ప్రఫుల్ రాంరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఇప్పటికైనా ఉద్యమకారులను గుర్తించి వారికి 250 గజాల జాగను, వృద్ధులకు పెన్షన్లను ఇతర హక్కులను నెరవేర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నిర్వాహకులు దరువు ఎల్లన్న దరువు అంజన్న మాట్లాడుతూ దరువు జాతర నిర్వహించడంలో తమకు అండగా నిలిచిన మంత్రి జూపల్లి కృష్ణారావు కి పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు. అలాగే నిర్వహణ భాగంలో సహాయం అందించిన దుర్గం భాస్కర్ కొండపాక విజయ్, శ్రీనివాస్, తిరుమల్ కు కృతజ్ఞతలు అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ నలుమూలల నుండి విచ్చేసిన కళాకారులు తమ ఆటపాటలతో తెలంగాణ ఉద్యమ రోజుల్ని గుర్తు చేశారు. కళాకారులు ఆలపించిన పాటలు సభికుల్ని అలరింపచేసాయి.

## పద్మశాలి యువజన సంఘం ఉపాధ్యక్షులుగా పొన్న గణేష్ బాబు



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఏప్రిల్ 23 :(వార్తా ప్రభ ప్రతినిధి)** భద్రాచలం,తెలంగాణ రాష్ట్ర పద్మశాలి యువజన సంఘము ఉప అధ్యక్షులు గా పొన్న.గణేష్ బాబు నియమితులు అయ్యారు ఈ సందర్భంగా భద్రాచలం లోని పద్మ శాలి సంఘము భవన్ లో మాజీ ఆల్ ఇండియా యూత్ ప్రెసిడెంట్ గుండేటి. శ్రీధర్ రాష్ట్ర యూత్ అధ్యక్షులు అంబటి శ్రీనివాస్ కొత్తగూడెం ఈ సి మెంబర్ సామంతుల నరేష్ తదితురుల సమక్షంలో గణేష్ బాబుకి నియమ పత్రము పదవి బాధ్యత లు ఇచ్చారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనపై నమ్మకం నుంచి ఈ బాధ్యత ఇచ్చినందుకు.ఇక నుంచి కూడా నిరంతరం జాతి అభ్యున్నతి కోసం కృషి చేస్తానన్నారు. ప్రతిభ గల పేద పద్మశాలి విద్యార్థులు ఉన్నత చదువులకు దూరం కాకుండా చూస్తానని, వారిని అన్ని విధాలుగా ఆదుకుంటానని హామీ ఇచ్చారు. సంఘం నిర్మాణానికి కృషి చేస్తానని అన్నారు సంగం నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు

## సమాజ అభివృద్ధికి భగీరథ మహర్షి చూపిన మార్గం ఆదర్శనీయం

### - సమాజ సేవకుడు ధాత్రీ నాథ్ గౌడ్



**శేరిలింగంపల్లి,ఏప్రిల్ 23 (వార్తాప్రభ):**హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని ప్రకాశ్‌నగర్‌లో సాగర సంఘం ఆధ్వర్యంలో శ్రీ భగీరథ మహర్షి జయంతి వేడుకలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో యువనాయకుడు,సామాజ సేవకుడు ధాత్రీనాథ్ గౌడ్ పాల్గొన్నారు.భగీరథ మహర్షి సేవలను స్మరించుకుంటూ సమాజ అభివృద్ధికి ఆయన చూపిన మార్గం ఆదర్శప్రాయమని ధాత్రీనాథ్ గౌడ్ పేర్కొన్నారు.సంఘబలం, సేవాభావంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు దిండి శ్రీనివాసులు సాగర్,ప్రధాన కార్యదర్శి బీసం చిన్నరాయుడు సాగర్,కోశాధికారి బీసం శేఖర్ సాగర్, గుంటి వినోద్ సాగర్, గుంటి లక్ష్మీనారాయణ సాగర్ తదితరులతో పాటు పలువురు సభ్యులు,మహిళా ప్రతినిధులు పాల్గొన్నారు.

## ఇళ్ల తాళాలు పగలగొట్టే దొంగల ముఠా అరెస్ట్



**బాచుపల్లి, ఏప్రిల్ 23, (వార్తాప్రభ)** : రాత్రి సమయాల్లో తాళం వేసి ఉన్న ఇళ్లను లక్ష్యంగా చేసుకుని దొంగతనాలకు పాల్పడుతున్న ఇద్దరు నిందితులను బాచుపల్లి క్రైమ్ టీం పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుండి బంగారు ఆభరణాలు మరియు వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. వివరాల్లోకి వెళితే బాచుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఇటీవల జరిగిన దొంగతనాలపై నిఘా ఉంచిన పోలీసులు, పక్కా సమాచారంతో నిందితులను అదుపులోకి తీసుకున్నారు. నిందితులు కూకట్‌పల్లి ప్రాంతానికి చెందిన నెమలి డేవిడ్ రాజ్ అలియాస్ వరుణ్ (19), మరియు ఆరె సాయి అలియాస్ ఆదిత్య (21)గా గుర్తించారు. వీరిద్దరూ రాత్రి వేళల్లో తాళాలు వేసి ఉన్న ఇళ్లను గుర్తించి చోరీలకు పాల్పడేవారు. నిందితుల నుంచి పోలీసులు 30 గ్రాముల బంగారం వెండి పట్టీలు దొంగతనాలకు వాడే హోండా టీఎస్ స్కూటీ పి స్వాధీనం చేసుకున్నారు: వీరిపై బాచుపల్లి (Cr.No.298/2026) మరియు నార్సింగి (Cr.No.140/2026) పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదై ఉన్నాయి. అంతేకాకుండా, గతంలోనూ వీరిపై మరో మూడు చోరీ కేసులు ఉన్నట్లు విచారణలో తేలింది. ఈ కేసును అత్యంత వేగంగా ఛేదించి, నిందితులను పట్టుకోవడంలో కీలక పాత్ర పోషించిన హెడ్ కానిస్టేబుల్ ఆనందరెడ్డి, పీసీలు రాజు, శ్రీనివాస్, నిరంజన్, సతీష్ మరియు కనకయ్యలను ఉన్నతాధికారులు ప్రత్యేకంగా అభినందించారు. వీరి పనితీరుపై డిఐ సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రస్తుతం నిందితులను కోర్టులో హాజరుపరిచి, జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

# ఎడిటోరియల్

## తమ్ముళ్లు తెలుసుకోవాలి: కూటమికే బాబు ప్రాధాన్యం!

అలవి కాని చోట అధికుల మనరాదన్న–సూత్రం అందరికీ వర్తిస్తుంది. పరిస్థితులు మారినప్పుడు.. కిందపడ్డా పైచేయి అనే ధోరణి ఉంటే.. అది మరింతగా కుంగదీస్తుంది... ఈ మాటలు ఇప్పుడు పిఠాపురం వర్మగా పేరొందిన.. టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే ఎస్‌వీఎస్ ఎన్ వర్మకు అక్షరాలా వర్తిస్తాయని అంటున్నారు పరిశీలకులు. 2024 అసెంబ్లీ ఎన్నికల సమయంలో పిఠాపురం టికెట్‌ను ఆయన వదులుకోవాల్సి వచ్చింది. జనసేనతో పొత్తు నేపథ్యంలో టీడీపీ ఆయనకు టికెట్‌ను నిరాకరించింది. ఈవిషయంలో తొలి నాళ్లలో ఎదురు తిరిగే ప్రయత్నం చేసినా.. తర్వాత.. సీఎం చంద్రబాబు జోక్యంతో అప్పట్లో సర్దుబాటు ధోరణిని ప్రదర్శించారు. తర్వాత.. పవన్ వెళ్లి.. స్వయంగా వర్మను ఒప్పించారు. ఆయన మాతృమూర్తి ఆశీర్వాదం కూడా తీసుకున్నారు. అక్కడితో వర్మ ప్రస్తావన పక్కకు జరిగింది. పవన్ కల్యాణ్ 70 వేల పైచిలుకు ఓట్ల మెజారిటీతో విజయం దక్కించుకున్నారు. కానీ, తర్వాత వర్మలో అసంతృప్తి సెగ రాజుకుంది. తనకు ప్రాధాన్యం లేకుండా పోయిందన్న వాదన వినిపిస్తోంది. ఈ క్రమంలోనే తరచుగా పిఠాపురం వివాదాలకు కేంద్రంగా మారింది. కానీ.. ఇప్పుడున్న పరిస్థితిలో నాయకులను పక్కన పెట్టయినా.. కూటమిని కాపాడుకునేందుకు చంద్రబాబు ప్రాధాన్యం ఇస్తున్నారు. వచ్చే ఎన్నికల్లోనే కాదు.. రాబోయే మూడు ఎన్నికల్లోనూ కూటమిని గెలిపించుకుని ఏపీని గాడిలో పెట్టాల న్న బృహత్ సంకల్పంతో కూటమి నాయకులు చంద్రబాబు, పవన్, బీజేపీలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో సీనియర్ నాయకులుగా ఉన్నవారు సర్దుకు పోవాలే తప్ప.. పైచేయి కోసం ప్రయత్నం చేస్తే.. వారే నష్టపోతారంటూ.. అనేక సందర్భాల్లో చంద్రబాబు చెప్పారు. ఇప్పుడు కూడా దాదాపు అదే పని చేస్తున్నారు. పిఠాపురంలో చోటు చేసుకున్న పరిణామాల్లో తప్పు ఎవరిది? ఒప్పు ఎవరిది? అని చంద్రబాబు చూడలేదు. కూటమిలో ఏర్పడిన వివాదాలను రోడ్డెక్కించడంపైనే ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కూటమి కలివిడికి ఇవన్నీ.. ఇబ్బందికరమని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే తమ్ముళ్లు తెలుసుకోవాలంటూ.. చంద్రబాబు గట్టిగానే చెప్పారు. అయినా.. ఇప్పటికీ తెలుసుకోకుండా.. పైచేయి కోసం.. ప్రయత్నం చేస్తే నాయకులనే పక్కన పెట్టే దిశగా చంద్రబాబు ఆలోచన చేస్తున్నారు. సో.. వర్మ అయినా.. మరొకరైనా.. ఇప్పుడు కూటమికే ప్రాధాన్యం ఇవ్వాలన్న చంద్రబాబు దూరదృష్టిని అర్థం చేసుకోవాల్సిందే.

## పౌష్టికాహారంతో ఆరోగ్యకరమైన జీవితం

**- మున్సిపల్ చైర్మన్ చిట్టిబాబు**



**ఇబ్రహీంపట్నం, ఏప్రిల్ 23 (వార్తా ప్రభ ప్రతినిధి):** ఆరోగ్యకరమైన, చురుకైన జీవితానికి పౌష్టికాహారం పునాది అని మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు అన్నారు. కొండపల్లి మున్సిపల్ కార్యాలయంలో ఐసీడీఎస్ సీడీపీవో పుష్పలత అధ్యక్షతన గురువారం పోషణ పక్వాడా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శరీర ఎదుగుదలకు, రోగనిరోధక శక్తిని పెంచడానికి, వ్యాధుల నివారణకు, మెదడు పనితీరుకు పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. శారీరక, మానసిక ఆరోగ్యానికి పౌష్టికాహారం అత్యంత ముఖ్యమన్నారు. సీడీపీవో పుష్పలత మాట్లాడుతూ పిల్లల మెదడు అభివృద్ధి రెండు సంవత్సరాల్లోపు 80 శాతం జరుగుతుందని, కనుక ఆ వయస్సులో సంరక్షణ, పోషణ అత్యవసరం అన్నారు. విజయ వాహిని చారిటబుల్ ఫౌండేషన్ ప్రోగ్రామ్ అసోసియేట్ సిహెచ్.దివ్యశ్రీ బ్యాలెన్స్ డ్ డైట్ గురించి, జంక్ ఫుడ్ వల్ల కలిగే అనర్థాలు వివరించారు. అనంతరం వంటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ చుట్టుకుదురు శ్రీనివాసరావు, మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాసులు, మెడికల్ ఆఫీసర్ ప్రేమ్ చంద్, కో – ఆప్షన్ సభ్యుడు మహబూబ్, ఐసీడీఎస్ సూపర్ వైజర్లు మాధవి, శివకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

## చేనేతను ఆదుకోవాలి



నరాలను పోగులుగా తీర్చిదిద్ది
రంగురంగుల దారాలతో చీరలు
నేసే
నేతన్నలు...
చేతుల నైపుణ్యంతో
అబ్బురపరిచే విధంగా
చీరలు నేసే పద్మశాలీలు...
మహిళలు తాము నేసిన
చీరలను
కట్టుకోలేని నిర్భాగ్యురాళ్ళు
కటిక పేదరికంలో
పూట గడవని నేతన్నలను
ఆదుకునే వారే కరువయ్యారు!
ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్న
నేతన్నలను గురించి గొప్పగా
చెప్పడమే గానీ... ఆదుకుని
వారిని ఆనందపరచేవారు
లేక పోయారు!
మహాకవి కబీర్ దాస్
లాంటి మహానుభావుల స్ఫూర్తితో
బ్రిటిష్ సామ్రాజ్యాన్ని
ఎదిరించిన నేతన్నలు ఎందరో...
చేనేత మగ్గం పై ప్రపంచం
మెచ్చే విధంగా చీరలు తయారు
చేయడం ఒక్క నేతన్నకే సాధ్యం!
కంచి, పోచంపల్లి, గద్వాల్,
వెంకటగిరి.... ఇలా ఎన్నో
కళాకృతులను...
కంటి వెలుగు పోతున్న
వెన్నుపూసలు అరిగిపోతున్న
తన ధ్యేయం, ధ్యాసతో కడవరకు
నేత వృత్తినే నమ్ముకున్న
నిరుపేదలు
నేతన్నలు!
రంగుల దారాలతో
నేతన్నలు నేస్తున్న వస్త్రాలతో
మన దేశ సంస్కృతిని
సంస్కారాన్ని, గౌరవాన్ని
ఇనుమడింప చేస్తున్నారు...
నేతన్నలు!
ప్రతి చేనేత ఇంటిలో
ఆనందం వెన్నెల్లా
విరియాలి...!

**- సినీనటి పూనం కౌర్**

# దుర్గగుడి మాస్టర్ ప్లాన్ లో భక్తులకు మరిన్ని వసతులు కల్పించాలి

**రాష్ట్ర ప్రభుత్వానికి సీనియర్ రాజకీయ నాయకులు ఆకుల శ్రీనివాస్ విజ్ఞప్తి**



**విజయవాడ పశ్చిమ ఏప్రిల్ 23: (వార్తా ప్రభ ప్రతినిధి)**దుర్గగుడి మాస్టర్ ప్లాన్ లో భక్తులకు మరిన్ని వసతులు కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వానికి సీనియర్ రాజకీయ నాయకులు ఆకుల శ్రీనివాస్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. దుర్గగుడి అభివృద్ధి విషయంలో ఇటీవల తాను ఇచ్చిన కొన్ని సూచనలను పరిగణనలోకి తీసుకుంటే భక్తులకు మరిన్ని సదుపాయాలు ఏర్పడతాయని ఆయన పేర్కొన్నారు. అత్యాధునిక యంత్రాల సాయంతో దుర్గ గుడి కొండపై ప్రాంతాన్ని సమతలంగా తొలగించినట్లయితే దేవాలయం అభివృద్ధికి ఎక్కువ స్థలం సమకూరుతుందని వివరించారు. మాస్టర్ ప్లాన్ లో కేవలం కొండ దిగువ ప్రాంతంలో అభివృద్ధి పనులు చేపడుతున్నారని, కొండపై ప్రాంతంలో పరిమితంగానే అభివృద్ధి పనులు చూపుతున్నారని పేర్కొన్నారు. ప్రపంచ ప్రఖ్యాత దేవస్థానముగా దుర్గగుడి అభివృద్ధి చెందేందుకు అన్ని విధాలా అవకాశాలు ఉన్నందున ప్రభుత్వం ఈ విషయంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆకుల శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. తిరుమల తరహాలో దుర్గగుడిని అభివృద్ధి చేయడంతో పాటు భక్తులకు అవసరమైన కాటేజీల నిర్మాణం, ఉద్యానవనాల పెంపకం వంటివన్నీ కొండపై ప్రాంతంలో ఏర్పాటు చేసేలా కొండను సమతలం చేయడం అవసరమని ఆయన పేర్కొన్నారు. ఇలా దుర్గగుడిని అభివృద్ధి చేస్తే భావి తరాలు కూడా ఆధ్యాత్మిక వాతావరణంలో శ్రీ కనకదుర్గమ్మవారిని దర్శించుకునేం దుకు వీలుంటుందని వివరించారు. ఇంద్రకీలాద్రి కొండ ప్రాంతాన్ని ఆలయ ప్రాంగణంతో సమానంగా చదును చేస్తే అనేక కొత్త నిర్మాణాలు ఏర్పాటు చేయవచ్చని అన్నారు. భక్తుల వసతి, అన్నదాన సౌకర్యాలు మెరుగుపరచవచ్చని తెలిపారు.

# బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆంధ్రప్రదేశ్ నూతన కార్యవర్గం







**విజయవాడ పశ్చిమ ఏప్రిల్ 23: (వార్తా ప్రభ ప్రతినిధి)**బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (బాయ్) ఆంధ్ర ప్రదేశ్ నూతన కార్యవర్గం సమావేశం నగరంలోని ఒక హోటల్లో జరిగింది. ఈ సమావేశంలో బాయ్ ఏపీ చైర్మన్ గా పి.శేషగిరిరావు (ఎన్టీఆర్ జిల్లా) నియమితులయ్యారు. అలాగే నేషనల్ ఆల్ ఇండియా ట్రస్టీగా సిహెచ్.రామకోటయ్య(విశాఖపట్నం), ఇమీడియట్ పాస్ట్ చైర్మన్ గా ఏ. నాగమల్లేశ్వరరావు (అమరావతి) నియమితులయ్యారు. ఏపీ స్టేట్ వైస్ చైర్మన్లుగా కె. వెంకట నాగిరెడ్డి(అనంతపురం), కే. శ్రీనివాస్ రెడ్డి (వైజాగ్ స్టీల్ సిటీ), కె. వెంకటేశ్వర్లు (విశాఖపట్నం), కే. తాతారెడ్డి (రావులపాలెం), కె. అజయ్ కుమార్ ఘోష్ (ఒంగోలు), కె. బాలాజీ (అమరావతి), జనరల్ సెక్రటరీగా ఎన్. నాగేశ్వరరావు (అనకాపల్లి) నియమితులయ్యారు. అలాగే జాయింట్ సెక్రటరీలుగా వి. జయరాం (గుంటూరు), ఏ. హరి విజయ్ కుమార్ (అనకాపల్లి), యు. కిరణ్ (తణుకు), జి. రమేష్ రెడ్డి (తిరుపతి), కె. శివప్రసాద్ (అమరావతి), నియమితులయ్యారు. ట్రెజరర్ గా వి. సతీష్ చౌదరి (తణుకు), జాయింట్ ట్రెజరర్ గా సిహెచ్ వి. సురేష్ బాబు (ఒంగోలు), అడ్వైజరీ కమిటీ అండ్ స్పోక్స్ పర్సన్స్ గా పి. రాజబాబు (విజయవాడ), వి. వెంకటేశ్వరరావు (విజయవాడ) నియమితులయ్యారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న సిహెచ్ రామకోటయ్య, అలాగే బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా నాయకులు ఏ. నాగమల్లేశ్వరరావు, వి. వెంకటేశ్వరరావు, డి. పంకజ్ రెడ్డి, బి. రాఘవరావు, బి. రాజబాబు తదితరులు మాట్లాడుతూ నూతన కార్యవర్గాన్ని అభినందించారు. బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అభివృద్ధికి నూతన ఉత్సాహంతో కృషి చేస్తామని నూతన కార్యవర్గం ప్రకటించడం జరిగింది.

# ఎమ్మెల్యే సుజనా చౌదరి ఆధ్వర్యంలో చలివేంద్రాలు..

**మజ్జిగ, తాగునీరు తో ప్రజల దాహార్తి, అలసట ను తీరుస్తున్న సుజనా - సుజలా**





**విజయవాడ పశ్చిమ ఏప్రిల్ 23 (వార్తా ప్రభ ప్రతినిధి )** విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి ఆధ్వర్యంలో సుజనా ఫౌండేషన్ సహకారంతో నియోజకవర్గంలోని ప్రధాన కూడళ్లలో చలివేంద్రాలు ఏర్పాటు చేశారు.. సుజనా – సుజల పేరిట ఏర్పాటు చేసిన ఈ చలివేంద్రాలలో చల్లని నీటి తో పాటు మజ్జిగ కూడా పంపిణీ చేస్తున్నారు. సుజనా చౌదరి కార్యాలయం రూపొందించిన సుజనా – సుజలా చలివేంద్రాలు ఆయా కూడళ్లలో ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి.. గత 3 రోజులుగా నియోజకవర్గంలోని సితార సెంటర్, చిట్టినగర్ చిట్టి గారి పార్కు దగ్గర, నెహ్రూ బొమ్మ సెంటర్, పంజా సెంటర్ ముసాఫిర్ ఖానా దగ్గర, మల్లికార్జున పేట సుబ్రహ్మణ్యేశ్వర స్వామి గుడి కింద, రథం సెంటర్ ఫ్లై ఓవర్ కింద, భవానీపురం శివాలయం సెంటర్, ప్రాంతాల్లో మజ్జిగ పంపిణీ. కార్యక్రమం చేపడుతున్నారు. ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్ పర్యవేక్షణలో స్తానిక సుజనా మిత్ర లు కార్యక్రమంలో పాల్గొంటున్నారు. ఎండలో పనులు చేసుకునే కార్మికులు, ముఠా కార్మికులు, పాద చారులు, వాహన చోదకులు , విద్యార్థులు ఈ చలివేంద్రాల వద్ద చల్లని నీటితో పాటు మజ్జిగ సేవించి అలసట నుంచి ఉపశమనం పొందుతున్నారు.. ఎమ్మెల్యే సుజనా చౌదరి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ సేవా కార్యక్రమాన్ని స్థానికులు కోనియాడుతున్నారు..

# గురుకుల ప్రవేశ పరీక్షల విజేతలకు అభినందనలు....



**పెనుగంచిప్రోలు, ఏప్రిల్ 23( వార్త ప్రభ )** 2026–27 విద్యా సంవత్సరంనకు సంబందించి, రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గురుకుల పాఠశాలలలో, 5 వ తరగతిలో ప్రవేశానికి, ఇటీవల నిర్వహించిన ప్రవేశ పరీక్షలలో, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (హెచ్. డబ్ల్యూ), సుబ్బాయిగూడెం విద్యార్థులు పగడం.మృదుల, మరియు, మాతంగి.పవన్ కుమార్ మంచి మార్కులతో,విజయ దుందుభి మ్రోగించి జగ్గయ్యపేట మరియు తిరువూరు లలో ఉన్న గురుకుల పాఠశాలలో సీట్లు పొందటమైనది. ఈ సందర్భంగా, ఈ రోజు పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ పగడం.సుధాకరరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కిలారు.సుధారాణి, వారి తరగతి ఉపాధ్యాయుడు మర్రి. ప్రభాకర్, ఉపాధ్యాయ సిబ్బంది కె.జ్యోతి, సి.హెచ్.కవిత తదితరులు, అభినందనలు తెలియచేస్తూ, వారిని చిరు సన్మానం తో సత్కరించంటమైనది.

# ముగిసిన పోషణ్ పక్వాడా

**ముమ్మిడివరం, ఏప్రిల్ 23 ( వార్త ప్రభ ):**నగర పంచాయతీ పరిధిలోని స్థానిక సిడిపిఒ కార్యాలయం వద్ద పోషణ్ పక్వాడా 15 రోజుల వేడుకల ముగింపు కార్యక్రమం గురు వారం నిర్వహించారు. దీనిలో భాగంగా తల్లులు, 6 ఏళ్ల లోపు పిల్లల పోషణ స్థాయిని మెరుగు పరచుటకు తృణ ధాన్యాల వినియోగం, వైవిధ్య భరిత ఆహార పోషణను అందించే కార్యక్రమాన్ని నిర్వహిం చారు.ఈ సందర్భంగా ప్రాజెక్టు ఐసిడిఎస్, సిడిపిఒ ఎం.నిహారిక మాట్లాడుతూ 6 ఏళ్ల లోపు చిన్నారులు, తల్లులు (బాలింతలు) పోషకాహార లోపాన్ని నివారించడమే పోషణ్ పక్వాడ్ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ముఖ్యంగా ఆరేళ్ల లోపు చిన్నారుల్లో మెదడు 85 శాతం వృద్ధి చెందు తుందని, వారి సమగ్ర అభివృద్ధికి తోడ్పడే ఆట, పాటల విద్య అంగన్ వాడీ కేంద్రాల్లో అందుబాటులో ఉంటుందన్నారు. ఎవరైనా వాడకంలో లేని బొమ్మలు ఉన్నట్లయితే వాటిని అంగన్ వాడీ కేంద్రాలకు అప్ప గించాలని కోరారు. అలాగే తల్లిదండ్రులు చిన్న పిల్లలకు సెల్‌ఫోన్, టివిలు అలవాటు చేయ కుండా, వారితో ఎక్కువ సమయం గడిపితే, అది పిల్లల మేథోభివృద్ధికి తోడ్పడుతుందని వివరించారు.

## బాలవికాస్ కేంద్రాల వార్షికోత్సవాలు



**చెరుకుపల్లి మండలం ఏప్రిల్ 23 :(వార్తా ప్రభ ప్రతినిధి)**సమరసతా సేవా ఫౌండేషన్ బాపట్ల జిల్లా దేవాలయాల ప్రముఖ్ పొన్నపల్లి సత్యనారాయణ తిరుమల తిరుపతి దేవస్థానముల ఆర్థిక సహాయంతో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మాణం జరిగిన దేవాలయాలలో జరుగుతున్న బాలవికాస్ కేంద్రాల వార్షికోత్సవం నిర్వహిస్తున్నట్లు జిల్లా దేవాలయాల ప్రముఖ పొన్నపల్లి సత్యనారాయణ తెలియజేశారు. బాలవికాస్ వార్షికోత్సవం ఈ నెల 28వ తేదీ మంగళవారం శ్రీ రామ నామ క్షేత్రం మండపంలో నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల్లో సృజనాత్మక శక్తిని వెలికి తీసే విధంగా ఆటల పోటీలు పాటల పోటీలు పోటీలు నిర్వహించి వార్షికోత్సవం రోజు సాంస్కృతి కార్యక్రమాల నిర్వహించి వారికి ఆ సభలో బహుమతులు ఇస్తున్నట్లు తెలియజేశారు. ఈ కార్యక్రమం లో జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమశంకరరావు, మండల కన్వీనర్ వేల్పూరి శ్రీనివాసరావు, మాజీ జెడ్పిటిసి బండారు శ్రీనివాసరావు చింతల మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## అంగలూరులో తీవ్ర ఉద్రిక్తత...




**గుడ్లవల్లేరు:ఏప్రిల్ 23 :(వార్తా ప్రభ ప్రతినిధి)**మండలంలోని అంగలూరు గ్రామంలో బుధవారం రాత్రి తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. పిల్లల మధ్య జరిగిన చిన్న గొడవ పెద్దల వరకు వెళ్లి కిరాతక దాడికి దారి తీసింది. ఈ ఘటనలో కొందరు వ్యక్తులు కత్తులతో దాడి చేయడంతో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. గొడవ కాస్త ఒక్కసారిగా ఉధృతమై హింసాత్మకంగా మారింది. గాయపడిన వారిని వెంటనే గుడివాడ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. సంఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ ఘర్షణ కారణమైన ఎనిమిది మంది నిందితులను రిమాండ్ చేస్తున్నట్లు ఎస్సై ఎన్ వి వి సత్యనారాయణ గురువారం తెలిపారు.

## సుజనా చౌదరి కార్యాలయంలో ఎల్వోసీలు అందచేత ..




**విజయవాడ పశ్చిమ ఏప్రిల్ 23 :(వార్తా ప్రభ ప్రతినిధి)**పశ్చిమ నియోజకవర్గం 48 వ డివిజన్ కి చెందిన గుండు గాయత్రి, 35 వ డివిజన్ కి చెందిన 19 ఏళ్ల చిన్నారి , 52 వ డివిజన్ కు చెందిన వరప్రసాద్ రాజు, 48 వ డివిజన్ కి చెందిన దమ్మిడి గాయత్రి అనారోగ్య సమస్యతో బాధ పడుతూ అత్యవసర చికిత్స కోసం ఎమ్మెల్యే కార్యాలయాన్ని సంప్రదించారు.. .. వారందరికీ వైద్య సహాయం కోసం అయ్యే మొత్తాన్ని సహకారం చేయాలని సీఎం సహాయ నిధికి లేఖ రాసారు.. దీనికి సంబంధించిన 21,50,100/– విలువైన నాలుగు, ఎల్వోసీ పత్రాన్ని గురువారం ఎమ్మెల్యే కార్యాలయంలో బాధితుల కుటుంబ సభ్యులకు అంద చేశారు.. కార్యక్రమంలో. ఎమ్మెల్యే కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్, మాజీ కార్పొరేటర్ మహమ్మద్ అబ్దుల్ ఖాదర్,జనసేన పార్టీ రూట్ కోఆర్డినేటర్ బావిశెట్టి శ్రీనివాస్. జలీల్ ఖాన్ తనయుడు సాహుల్ ఖాన్, జనసేన పార్టీ నాయకులు దుక్క దుర్గారావు , తెలుగు యువత నాయకులు దాడి మురళీకృష్ణ, 54వ డివిజన్ టిడిపి ఎస్సీ నాయకులు మండే అంబేద్కర్, సుజనా మిత్ర లు తదితరులు పాల్గొన్నారు.. 39 వ డివిజన్ జనసేన ప్రెసిడెంట్ ఏలూరు సాయి శరత్ , సుజనా మిత్ర లు పాల్గొన్నారు..

## ఈడేపల్లి సీతారామపురంలో ఓణిల వేడుక సందడి

**పాల్గొన్న జనసేన నేత ఏ ఎన్ బాబు**



**ముదినేపల్లి ఏప్రిల్ 23 (వార్తా ప్రభ)** ఈడేపల్లి సీతారామపురం గ్రామంలో ఈరోజు ఉత్సాహభరిత వాతావరణంలో శీలం సురేష్ ముద్దుల కూతురు ఓణిల (లాంగ్ హాఫ్ సారీ) ఫంక్షన్ ఘనంగా నిర్వహించబడింది. ఈ శుభకార్యానికి గ్రామస్థులు, బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో హాజరై చిన్నారికి ఆశీర్వాదాలు అందజేశారు. ఈ సందర్భంగా జనసేన పార్టీ నాయకులు ఏ ఎన్ బాబు ముఖ్య అతిథిగా పాల్గొని చిన్నారిని ఆశీర్వదించారు. కుటుంబ సభ్యులతో ఆత్మీయంగా ముచ్చటించి శుభాకాంక్షలు తెలిపారు. సంప్రదాయాలు, సంస్కృతి పరిరక్షణలో ఇలాంటి వేడుకలు కీలకమని ఆయన పేర్కొన్నారు. గ్రామ పెద్దలు, మహిళలు, యువత ఉత్సాహంగా పాల్గొని వేడుకను విజయవంతం చేశారు. అతిథులకు కుటుంబ సభ్యులు సత్కారం నిర్వహించగా, కార్యక్రమం ఆనందోత్సాహాల మధ్య ముగిసింది.

# చదువు జీవితాన్ని మార్చే శక్తి

## కృషి, పట్టుదలతోనే ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చు -ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు

**గన్నవరం, ఏప్రిల్ 23 :(వార్తా ప్రభ ప్రతినిధి)**విద్యార్థులు మారుతున్న కాలానికి అనుగుణంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఆ×) వంటి ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకోవాలని ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు పిలుపునిచ్చారు. బుధవారం రాత్రి గన్నవరం బాయ్స్ హై స్కూల్ ప్రాంగణంలో ఇంటర్మీడియట్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అభినందించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో విజేతలకు నగదు బహుమతులు అందజేశారు . మాజీ సర్పంచ్ పాలడుగు వెంకట వరప్రసాద్ (నాని) సహకారంతో విద్యార్థులకు ప్రోత్సాహకాలు అందించారు. బైపిసి విభాగంలో రాష్ట్ర స్థాయి ప్రథమ స్థానం సాధించిన కేసరపల్లి చెందిన మోట్రు మౌనికకు రూ.25,000 బహుమతి అందించారు. కూచిపూడి ఐశ్వర్యకు రూ.10,000, ఎంపీసీ టాపర్ ఈలప్రోలు దివ్యకు రూ.10,000, జూనియర్ ఎంపీసీ టాపర్ సగ్గుర్తి మౌనికకు రూ.5,000 చొప్పున ప్రోత్సాహకాలు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యార్లగడ్డ మాట్లాడుతూ కృషి, పట్టుదలతోనే విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని తెలిపారు. చదువు జీవితం మార్చే శక్తి అని అన్నారు. నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని చెప్పారు. కేసరపల్లిలో



నిరుద్యోగ యువతకు ఉచితంగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ పై శిక్షణ అందించమన్నామని, దీని ద్వారా మంచి ఉద్యోగాలు పొందే అవకాశం ఉందని వివరించారు. అలాగే పరిశ్రమల ద్వారా స్థానికులకు ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సి డాక్ సెంటర్ ను గన్నవరానికి తీసుకురావడానికి ప్రయత్నాలు తుది దశ కు చేరుకున్నాయని వెల్లడించారు. పాఠశాలల అభివృద్ధికి సహకరిస్తున్న దాతలను ఎమ్మెల్యే అభినందించారు. గన్నవరం నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సునీల, ఉప విద్యాశాఖ అధికారి (గుడివాడ డివిజన్) కొండా రవికుమార్, ఎంఈవో



– 2 కమలకుమారి, ఎస్.ఎం.సి చైర్మన్ సుచరిత, గన్నవరం ఏయంసి చైర్మన్ గూడవల్లి నరసింహారావు, గన్నవరం మండల టిడిపి అధ్యక్షులు గూడపాటి తులసిమోహన్, వైస్ ఎంపీపీ కొమ్మురాజు సుధీర్, మాజీ సర్పంచ్ పాలడుగు వెంకట వరప్రసాద్ (నాని), మాజీ ఏయంసి చైర్మన్ కోటగిరి వరప్రసాద్, మాజీ ఎంపీపీ తులిమిల్లి ఝాన్సీ, బోడపాటి రవి, బోయపాటి మురళీ కృష్ణ, మద్దినేని వెంకటేశ్వరరావు, మేడేపల్లి రమ, కొసరాజు సాయిరాం, అన్నే హరికృష్ణ, యనమదల సతీష్, అంకెం రామారావు, చిమటా రవివర్మ, మల్లారెడ్డి కిషోర్, కంభంపాటి కృష్ణ కిషోర్, కంచర్ల సూర్య, కూడారపు వెంకట కృష్ణ, కాగితాల నాగరాజు, మణిమాల వెంకట అప్పారావు, చిట్టినేని జోజి, సూరిబోయిన రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## భగీరథ మహర్షి మహా జ్ఞాని.

### జిల్లా ఇన్చార్జి కలెక్టర్ ఎం నవీన్.



**మచిలీపట్నం ఏప్రిల్ 23 :(వార్తా ప్రభ ప్రతినిధి)** భగీరథ మహర్షి మహా జ్ఞాని, పరోపకారానికి పెట్టింది పేరని, దీక్షకు సహనానికి ప్రతిరూపం అని జిల్లా ఇన్చార్జి కలెక్టర్ ఎం నవీన్ పేర్కొన్నారు. భగీరథ మహర్షి జయంతి పురస్కరించుకొని జిల్లా బీసీ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన భగీరథ మహర్షి జయంతి వేడుకలలో భాగంగా గురువారం నగరంలోని కలెక్టరేట్ మీకోసం సమావేశ మందిరంలో జిల్లా ఇన్చార్జి కలెక్టర్ భగీరథ మహర్షి చిత్రపటానికి ఘనంగా పుష్పాంజలి ఘటించారు. జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు భగీరథ మహర్షి జయంతి వేడుకలను నిర్వహించడం జరుగుతుందన్నారు. భగీరథ మహర్షి కఠోర తపస్సు చేసి దివి నుండి గంగను భూమికి తీసుకువచ్చారన్నారు. ఎవరైనా కష్టపడి దేన్నైనా సాధిస్తే భగీరథ ప్రయత్నం చేశారని అంటుంటారన్నారు. ఆ మహర్షిని స్ఫూర్తిగా తీసుకొని జలధార జల హారతి కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతం చేయాలన్నారు. జల సంరక్షణ కార్యక్రమాలు ముమ్మరంగా చేపట్టాలన్నారు. జలమే జీవమని భావించి అన్ని జలవనరుల సామర్థ్యం పెంచడం ద్వారా భూగర్భ జలాల పెంపుదలకు అందరూ కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ చంద్రశేఖర రావు, బీసీ సంక్షేమ సాధికారతాధికారి రమేష్, విజిలెన్స్ డిప్యూటీ కలెక్టర్ పోతురాజు, కలెక్టరేట్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆల్ ఇండియా స్థాయిలో ద్వితీయ ర్యాంకు సాధించిన సంగం విద్యార్థి





**సంగం ఏప్రిల్ 23(వార్తాప్రభ ప్రతినిధి)** జాతీయ స్థాయి సైన్స్ పోటీల్లో సంగం ప్రాంతానికి చెందిన విద్యార్థి ప్రతిభ చాటాడు. కౌన్సిల్ ఫర్ న్యూట్రింగ్ అకాడమి పొటెన్షియల్ ఇన్ స్టూడెంట్స్ నిర్వహించిన ప్రతిష్టాత్మక జూనియర్ ఒలింపియాడ్ ఇన్ సైన్స్ అండ్ ఆస్ట్రానమీ 2025-26లో చల్లా వెంకట సాయి విష్ణుష్ ఆల్ ఇండియా స్థాయిలో రెండో ర్యాంకు సాధించి విశేష కీర్తి గడించారు. నెల్లూరులోని నారాయణ హైస్కూల్లో 10వ తరగతి చదువుతున్న విష్ణుష్ దేశవ్యాప్తంగా వేలాది మంది విద్యార్థులు పాల్గొన్న ఈ కఠిన పోటీలో ద్వితీయ స్థానం దక్కించుకోవడం విశేషంగా నిలిచింది. ఈ విజయంతో సంగం ప్రాంతానికి గర్వకారణంగా నిలిచాడు. ఈ సందర్భంగా నిర్వాహకులు విష్ణుష్‌కు మెడల్ సర్టిఫికేట్ మెమెంటోతో పాటు శాంసంగ్ గెలాక్సి ట్యాబ్ ఎలెవెన్ ను బహుమతిగా అందజేశారు. విద్యార్థి సాధనపై పాఠశాల యాజమాన్యం ఉపాధ్యాయులు ప్రశంసలు కురిపించగా తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో శాస్త్ర సాంకేతిక రంగాల్లో మరిన్ని విజయాలు సాధించాలని పలువురు ఆకాంక్షించారు.

# ఎండల విషయంలో ప్రజలు అత్యంత జాగ్రత్తగా ఉండాలి.!

### జిల్లా ఇన్చార్జి కలెక్టర్ ఎం నవీన్.

**మచిలీపట్నం ఏప్రిల్ 23 :(వార్తా ప్రభ ప్రతినిధి)** ప్రస్తుతం జిల్లాలోఎండలు ఎక్కువగా ఉన్నందున ప్రజలు అత్యవసరమైతే తప్ప బయట తిరగరాదని తగినన్ని జాగ్రత్తలు పాటిస్తూ ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ ఎం నవీన్ పిలుపునిచ్చారు. గురువారం ఉదయం నగరంలోని నగరపాలక సంస్థ కార్యాలయం ముంగిట శ్రీ సత్య సాయి సేవ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని జిల్లా ఇన్చార్జి కలెక్టర్, అదనపు ఎస్పీ సత్యనారాయణతో కలిసి ప్రారంభించి ప్రజలకు, మంచినీరు మజ్జిగ పంపిణీ చేశారు. జిల్లా ఇన్చార్జి కలెక్టర్ మాట్లాడుతూ ఎండ వేడిమి ఎక్కువగా ఉండడంతో ప్రజల సౌకర్యం కోసం శ్రీ సత్య సాయి సేవ సమితి చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. చలివేంద్రంలో మంచినీటితో పాటు మజ్జిగ కూడా పంపిణీ చేయడం చాలా సంతోషదాయకమన్నారు. ప్రస్తుతం ఎండలు ఎక్కువగా ఉన్నందున ప్రజలు ఎవరూ కూడా అత్యవసరమైతే తప్ప బయట తిరగరాదని, తెల్లని వస్త్రాలు, తలకు టోపీ గాని తలపాగా గాని ధరించడం వంటి జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలన్నారు. ప్రజలు మంచినీరు, మజ్జిగ , కొబ్బరి నీళ్లు ఎక్కువగా తాగాలని, శరీరంలో నీటి శాతం తగ్గకుండా చూసుకుంటూ ఆరోగ్యం కాపాడుకోవాలన్నారు. అదనపు ఎస్పి సత్యనారాయణ మాట్లాడుతూ సత్య సాయి సేవ సమితి చలివేంద్రం ఏర్పాటు చేయడం చాలా సంతోషదాయకమన్నారు. సమితి వారు ప్రతి సోమవారం జిల్లా పోలీసు కార్యాలయం, కలెక్టర్ వారి కార్యాలయంలో




జరిగే మీకోసం కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుండి వచ్చే ప్రజలకు స్వచ్ఛందంగా అల్పాహారము మంచినీరు అందజేసి ఎంతగానో తోడ్పాటు అందిస్తున్నారన్నారు. అలాగే ప్రతి సంవత్సరము సమితి వారు చలివేంద్రం ఏర్పాటు చేసి చాలా పద్ధతి ప్రకారం నడుపుతూ ప్రజలందరికీ మంచినీటి సౌకర్యం అందుబాటులో ఉంచుతున్నందుకు వారికి ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. మునిసిపల్ సహాయ కమిషనర్ గోపాలరావు, సత్యసావ సమితి సేవా సమితిజిల్లా అధ్యక్షులు కొమరగిరి చంద్రశేఖర్, కన్వీనర్ పోతుకూచి ఆంజనేయ కుమార్, సహ కన్వీనర్ ఆనుమకొండ వెంకటేశ్వరరావు పలువురు పోలీసులు, సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.

## జడ్పీ హైస్కూల్‌లో కొత్త తరగతి గదుల ప్రారంభం



**గన్నవరం, ఏప్రిల్ 23 :(వార్తా ప్రభ ప్రతినిధి)**ఉంగుటూరు మండలం పెదవుటపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కొత్తగా నిర్మించిన అదనపు తరగతి గదులను ఏపీ ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ప్రారంభించారు. ఈ గదులను దాత వేగె లక్ష్మి శ్రీనివాసరావు రూ.31.16 లక్షలతో నిర్మించి పాఠశాలకు అందించారు. ఈ సందర్భంగా జ్యోతి ప్రజ్వలన చేసి చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే యార్లగడ్డ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో చదివితేనే జీవితంలో మంచి స్థాయికి చేరుకుంటారని అన్నారు. చదువుకునే సమయంలో సమయాన్ని వృథా చేయకుండా లక్ష్యంపై దృష్టి పెట్టాలని సూచించారు. ప్రభుత్వం అందిస్తున్న విద్యా సౌకర్యాలను సరిగ్గా ఉపయోగించుకోవాలని విద్యార్థులకు చెప్పారు. ఈ పాఠశాలలో చదివిన చాలా మంది మంచి స్థాయికి ఎదిగారని గుర్తు చేశారు. పాఠశాలకు సహాయం చేసిన దాతను అభినందించిన ఎమ్మెల్యే, మరింత మంది ఇలాగే ముందుకు రావాలని కోరారు. అలాగే కేసరపల్లి సచివాలయం-2లో హెచ్‌సీఎల్ ఫౌండేషన్ సహకారంతో త్వరలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ శిక్షణ కేంద్రం ప్రారంభించనున్నట్లు తెలిపారు. మండల ఎంపీడీవో సత్యకుమార్, మండల తహశీల్దార్ విమలాకుమారి, ఉప విద్యాశాఖ అధికారి కొండా రవికుమార్, గన్నవరం ఏయంసి చైర్మన్ గూడవల్లి నరసింహారావు, ఉంగుటూరు మండల టిడిపి అధ్యక్షులు కొలుసు రవీంద్ర, కొండేటి వెంకటేశ్వరరావు, మున్నా రామకృష్ణ, కుందేటి చంద్రశేఖర్, ఆళ్ల చిరంజీవి మల్లికార్జునరావు, ఆళ్ల హనోక్, రాజబోయిన శివాజీ, మేడేపల్లి రమ, తుమ్మల లత, యార్లగడ్డ విజయ్ బాబు, వేగే సూర్య నారాయణ, బాజీ, కొసరాజు సాయి, కాసర్నేని రంగబాబు, అన్నే హరికృష్ణ, మరీదు శ్రీధర్, యార్లగడ్డ అజయ్ శేఖర్, అట్లూరి రామ్ కిరణ్, యర్రగుంట్ల వినోద్, పొట్లూరి భువనేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# పుస్తకాలను చదవడం ఆసక్తి గా మార్చుకోవాలి.!

- కెయూ ఉపకులపతి ఆచార్య కె. రాంజీ
- వర్సిటీ లో ప్రపంచ పుస్తక దినోత్సవ వేడుకలు.



**మచిలీపట్నం ఏప్రిల్ 23 :(వార్తా ప్రభ ప్రతినిధి)**కృష్ణా విశ్వవిద్యాలయం: విద్యార్థులు పుస్తక పఠనం ను ఆసక్తిగా ఎంచుకోవాలని కృష్ణా విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కె. రాంజీ పేర్కొన్నారు. గురువారం విశ్వవిద్యాలయ సెంట్రల్ లైబ్రరీ లో నిర్వహించిన ప్రపంచ పుస్తక దినోత్సవ వేడుకలలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ రోజు ప్రముఖుల గా ఆరాధించబడుతున్న ప్రతి ఒక్కరూ పుస్తకాలను ఆసక్తి గా చదవడం వల్ల ఆ స్థాయికి చేరుకున్నారని వివరించారు. సాంకేతికత పెరిగి ఫోన్లు, కంప్యూటర్లు తో కాలక్షేపం చేస్తున్నా పుస్తక పఠనం ను కూడా దిన చర్యలో భాగంగా మలచుకోవడం అవసరమన్నారు. తద్వారా ఒత్తిడి తగ్గించుకోవడం సాధ్యమవుతుందన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య ఎన్. ఉష మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో భాషా పరిజ్ఞానం చాలా అవసరమని, అది పుస్తక పఠనం ద్వారానే పెంచుకోగలమన్నారు. తెలుగు తో పాటు ఆంగ్లం, హిందీ భాషల్లో ప్రావీణ్యం సంపాదించుకుంటే ఉత్తర భారతదేశం తో పాటు విదేశాల్లో కూడా ఉపాధి అవకాశాలు పొందవచ్చన్నారు. డా. ఏపిజే. అబ్దుల్ కలాం సెంట్రల్ లైబ్రరీ సమన్వయకర్త డాక్టర్ ఎం. శ్రావణి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కృష్ణా జిల్లా గ్రంథాలయ సంస్థ డిప్యూటీ లైబ్రేరియన్ రమణ, కృష్ణా విశ్వవిద్యాలయం విశ్రాంత తెలుగు సహాయ ఆచార్యులు వరుణకుమారిలు గ్రంథాలయాల ఆవశ్యకత, పుస్తక పఠనం పై ప్రసంగించారు. ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాలల విద్యార్థులు తో పాటు ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల విద్యార్థులు ప్రపంచ పుస్తక దినోత్సవ వేడుకలు పురస్కరించుకుని తమదైన శైలిలో ప్రసంగించారు. అనంతరం అతిథులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా తాళపత్ర గ్రంథాలు, భారత రాజ్యాంగం తో పాటు అరుదైన, విలువైన పుస్తకాల తో ఏర్పాటు చేసిన ప్రదర్శన ను విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు.

## పోషణ పక్వాడ ముగింపు లో ప్రతిజ్ఞ

**పెనుగంచిప్రోలు, ఏప్రిల్ 23( వార్త ప్రభ )** ఎన్టీఆర్ జిల్లా: చిల్లకల్లు ప్రాజెక్టు, ఐ. సి. డి. ఎస్. సి. డి. పి.ఓ బి.సత్యవాణి ఆదేశాల మేరకు గురువారం పెనుగంచిప్రోలు గ్రామంలో ఎనిమిదవ పోషణ పక్వాడ కార్యక్రమంలో ముగింపు రోజు కావడం చేత ఈరోజు పెనుగంచిప్రోలు లోని అంగన్వాడీ కేంద్రంల లో పోషణ పక్వాడ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. 0o5 ఇయర్స్ పిల్లలను మరి





ముఖ్యంగా జంక్ ఫుడ్ లకు ఫోన్ స్క్రీనింగ్ లకు దూరంగా ఉంచాలని జంక్ ఫుడ్ వాడకం మరియు ఫోన్ స్క్రీనింగ్ చూడటం వలన పిల్లల్లో కలిగే నష్టాలను వారి తల్లిదండ్రులకు వివరించడం జరిగింది . అదేవిధంగా పోషణ పక్వాడ ప్రతిజ్ఞను నిర్వహించటం జరిగింది. ఈ కార్యక్రమంలో గర్భవతులు బాలింతలు, 0o5ఇయర్స్ పిల్లలు, తల్లులు, ఏఎన్ఎంలు, అంగన్వాడి కార్యకర్తలు, హెల్పర్స్ పాల్గొనడం జరిగింది.

# క్యూబాకు అండగా ఉంటాం

### రష్యా ఉప విదేశాంగ మంత్రి



హవానా : అమెరికా దురాక్రమణ బెదిరింపుల నేపథ్యంలో రష్యా ఉప విదేశాంగ మంత్రి సెర్గీ ర్యాబ్కోవ్ తాజాగా క్యూబాలో పర్యటించారు. గురువారం హవానా కనెన్షన్ సెంటర్‌లో సెర్గీతో క్యూబా అధ్యక్షుడు మిగెల్ డియాజ్ కానెల్ సమావేశమయ్యారు. ఇరు దేశాల మధ్య రాజకీయ, ఆర్థిక సంబంధాలను మరింత బలపరుచుకునే విషయాలపై ఇరువురు నేతలు చర్చించుకున్నారు. ఇప్పటికే ఉన్న సంబంధాలను మరింత పెంపొందిం చుకోవడానికి ఇరు దేశాలు సుముఖత వ్యక్తం చేసినట్లు క్యూబా విదేశాంగమంత్రిత్వశాఖ టెలిగ్రామ్‌లో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొంది. క్యూబాను ప్రభావితం చేస్తున్న ప్రస్తుత సంక్షోభం నేపథ్యంలో మాస్కో అందిస్తున్న సంఘీభావ ప్రయత్నాలకు రష్యా అధ్యక్షుడు వ్లాదిమర్ పుతిన్‌కు డియాజ్ కానెల్ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. కాగా, ఈ పర్యటన సందర్భంగా 'మేము మీకు అండగా ఉంటాము' అని ర్యాబ్కోవ్ కానెల్‌కి నొక్కి చెప్పారు. ఈ పర్యటనలో ఇరు దేశాల మధ్య రాజకీయ, వాణిజ్య, పారిశ్రామిక సంబంధాలపై ఇరు ప్రతినిధి బృందాలు దృష్టి సారించాయి. ఆర్థిక వ్యవస్థను పునరుద్ధరించేందుకు క్యూబాలోని పారిశ్రామిక సదుపాయాలను నిర్వహించేందుకు రష్యన్ కంపెనీలకు అధికారం ఇవ్వడం జరిగింది. ఏప్రిల్ 1న సెయింట్ పీటర్స్‌బర్గ్‌లో జరిగిన 23వ రష్యా- క్యూబా అంతర్ ప్రభుత్వ కమిషన్‌లో ఈ నిర్ణయం ఖరారు చేయబడింది. ఈ కమిషన్‌లో క్యూబా ఉత్పాదక సామర్థ్యాన్ని బలోపేతం చేసే ఉమ్మడి ప్రాజెక్టులను ప్రోత్సహించడానికి ఇరుపక్షాలు అంగీకరిం చాయి.

## భగీరథ మహర్షి అందరికీ స్ఫూర్తిదాయకం: ఎంపీ

**అనంతపురం పెనుగంచిప్రోలు, ఏప్రిల్ 23( వార్త ప్రభ )** నగరంలో భగీరథ మహర్షి జయంతి సందర్భంగా ఎంపీ అంబిక మహర్షి విగ్రహానికి పూలమాలలు సమర్పించి నివాళులర్పించారు. దివి నుండి భువికి గంగను తెచ్చిన భగీరథుడి అపారమైన పట్టుదల, అచంచల సంకల్పం ప్రతి ఒక్కరికీ స్ఫూర్తిదాయకమని ఆమె అన్నారు.

## స్వచ్ఛ బందరును నిర్మిద్దాం....

### గిరిజన సంక్షేమ శాఖ అధికారి ధూర్జటి.



**మచిలీపట్నం ఏప్రిల్ 23 :(వార్తా ప్రభ ప్రతినిధి)**వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు సామాజిక పరిశుభ్రతపై ప్రతి ఒక్కరూ దృష్టి సారిస్తే ఆరోగ్యవంతమైన సమాజాన్ని ఏర్పాటు చేసుకోవచ్చని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి ముదిగొండ పణి ధూర్జటి అన్నారు. స్వచ్ఛ బందరు కార్యక్రమంలో భాగంగా మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో 29వ డివిజన్లో అంకన వారి వీధిలో బ్లాక్ స్పాట్ లోని చెత్తను తొలగించి వైట్ స్పాట్ గా చేయడం జరిగింది .మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఉపాధ్యక్షుడు బొమ్మిడి స్వామి. జిల్లా కో కన్వీనర్ ముదిగొండ శాస్త్రి, మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ కార్యవర్గ సభ్యుడు వి సుందర రాంల ఆధ్వర్యంలో నిర్వహించిన సేవా ఈ కార్యక్రమంలో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి ధూర్జటి తోపాటు టిడిపి నాయకులు నారాయణ ,తలారి సోమశేఖర్ పాల్గొన్నారు మచిలీపట్నం మెయిన్ రోడ్ లో జవారు పేటలో రోడ్డు పక్కన ఉన్న చెత్తను తొలగించారు ఈ కార్యక్రమంలో పాల్గొన్న పారిశుద్ధ్య కార్మికులకు సుందర రాం గ్లౌజులు ,వాటర్ బాటిల్స్ ,టోపీలు అందజేశారు ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పణి ధూర్జటి మాట్లాడుతూ, స్వచ్ఛ బందరు రూపొందించుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు .తమ ఇళ్లలోనిచెత్తను రోడ్లపై వేయకుండా పారిశుధ్య కార్మికులకు అందించాలన్నారు .డ్రైన్లలో చెత్త వేయడం వల్ల మురికి నీరు సరిగా పారదని దీనివల్ల దోమలు పెరుగుతాయన్నారు .జిల్లా కలెక్టర్ బాలాజీ పిలుపుమేరకు మచిలీపట్నం స్వచ్ఛబందరు గా రూపొందించేందుకు అందరూ సహకరించాలనికోరారు

## మారుతున్న కాలాన్ని బట్టి విద్యార్థులకు నూతన విద్యా విధానం అవసరం-మిట్ట లక్ష్మీ

### సృజన లేడీస్ క్లబ్ ఆధ్వర్యంలో పాఠశాలలకు ప్రొజెక్టర్స్ మరియు స్క్రీన్స్ అందజేత




**జి.కొండూరు, ఏప్రిల్ 23 :(వార్తా ప్రభ ప్రతినిధి)**మారుతున్న కాలానికి అనుగుణ గా విద్యార్థులకు నూతన విద్యా విధానం అవసరమని గెయిల్ ఇండియా లిమిటెడ్ సృజన లేడీస్ క్లబ్ అధ్యక్షురాలు మిట్ట లక్ష్మీ పేర్కొన్నారు.గెయిల్ ఇండియా లిమిటెడ్ జి.కొండూరు వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎంప్లాయిస్ " సృజన లేడీస్ క్లబ్"వారు జి.కొండూరు మండలంలోని కట్టుబడిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,చెర్వుమాధవరం హైస్కూల్ గడ్డమణుగు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల విద్యర్ధిని, విద్యార్థులకు ఉపయోగపడే ప్రొజెక్టర్స్ మరియు స్క్రీన్స్ ను గురువారం అందజేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మిట్ట లక్ష్మీ మాట్లాడుతూ విద్యార్థులు నూతన టెక్నాలజీని ఉపయోగించుకొని మంచి జ్ఞానాన్ని సంపాదించుకోవాలని ఆకాంక్షించారు. ప్రొజెక్టర్ మరియు స్క్రీన్స్ ద్వారా బోధన అందిస్తే విద్యార్థులకు సులువుగా అర్థం అవుతుందని తెలిపారు.వీటిని విద్యార్థిని విద్యార్థులు సద్వినియోగించుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో సృజన లేడీస్ క్లబ్ సెక్రెటరీ జి.వైష్ణవి, ట్రెజరీ వి.కవిత,సృజన లేడీస్ క్లబ్ మహిళ సభ్యులు పాల్గొన్నారు.

## మేడ్చల్ జిల్లా కలెక్టర్ ను కలిసిన మీడియా కమిటీ సభ్యులు



**కూకట్ పల్లి, ఏప్రిల్ 23(వార్తాప్రభ):**మేడ్చల్ జిల్లా మీడియా కమిటీ సభ్యులు జిల్లా కలెక్టర్ మనో చౌదరిని మర్యాదపూర్వకంగా కలిశారు. గురువారం కలెక్టరేట్ లోని ఆయన చాంబర్లో కలిసి సత్కరించారు.జిల్లాలో పనిచేస్తున్న వర్కింగ్ జర్నలిస్టులందరికీ అక్రిడేషన్లను మంజూరు చేయాలని కోరడం జరిగింది.ఇందుకు స్పందించిన ఆయన జీవో మేరకు తప్పనిసరిగా అర్హులందరికీ అందజేస్తామని తెలిపారు.ఎలాంటి అవకతవకలకు తావు లేకుండా పారదర్శకంగా జర్నలిస్టులను గుర్తించాలని కోరారు. కార్యక్రమంలో అక్రిడిషన్ కమిటీ సభ్యులు మోతే వెంకట్ రెడ్డి, గడ్డమీది బాలరాజు,రామారావురవి,సునీల్,ప్రసాద్,భూపాల్, రాజేష్ రెడ్డి, యూసుఫ్ దిన్, అబుద్ స్వామి,జిల్లా పౌర సంబంధాల అధికారిని స్వర్ణలత, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అయ్యర్పల్లి పీపీసీ కేంద్రాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

### వరి కొనుగోళ్లు వేగవంతం చేయాలి: కలెక్టర్



**కామారెడ్డి,ఏప్రిల్ 23. (వార్తాప్రభ)** కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ లింగంపేట మండలం అయ్యర్పల్లి గ్రామంలోని ఐకేపీ పీపీసీ కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ రైతులతో నేరుగా మాట్లాడి, కొనుగోలు కేంద్రంలో వారికి ఎదురవుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ధాన్యం తూకం, తేమ శాతం పరీక్ష, గన్నీ బ్యాగుల లభ్యత తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు.అనంతరం వరి సేకరణకు సంబంధించిన సివిల్ సప్లైస్, మార్కెటింగ్, ఐకేపీ, పీఏసీఎస్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ "రైతులు ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని చివరి గింజ వరకు కొనుగోలు చేయాలి. కొనుగోలు ప్రక్రియలో ఎక్కడా జాప్యం జరగకుండా చూడాలి" అని అధికారులను ఆదేశించారు."కొనుగోలు చేసిన వెంటనే రైతులకు చెల్లింపులు జరిగేలా చర్యలు తీసుకోవాలి. దీని కోసం ప్రతి రోజు జరిగే కొనుగోళ్ల వివరాలను అదే రోజు ఓ పి ఎం ఎస్ ట్యాబ్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలి. నమోదులో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదు" అని హెచ్చరించారు.రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కేంద్రాల్లో తాగునీరు, నీడ వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. దళారుల ప్రమేయం లేకుండా పారదర్శకంగా కొనుగోళ్లు జరపాలని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మైలవరం మండలంలోని మొరుమిల్లి గ్రామంలో 15వ ఆర్థికసంఘం నిధులు రూ.36లక్షలతో గ్రామీణ ఆరోగ్య కేంద్ర భవనం (హెల్త్ సెంటర్) నిర్మాణానికి ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాదు గురువారం సాయంత్రం శంకుస్థాపన చేశారు.

**-వార్తా ప్రభ ప్రతినిధి, మైలవరం**

# అధిక రసాయన ఎరువులు, పురుగుమందులు వాడటం అనర్థం - ఏ డి ఏ మోహన్ రావు




**ప్రత్తిపాడు, ఏప్రిల్ 23 :(వార్తా ప్రభ ప్రతినిధి);**అధిక రసాయన ఎరువులు, పురుగుమందులు వాడటం వలన అనర్థమే ఎక్కువగా ఉంటుందని గుంటూరు వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు ఎన్ .మోహన్ రావు అన్నారు.గురువారం ప్రత్తిపాడు మండల వ్యవసాయాధికారిణి కార్యాలయం లో నిర్వహించిన ధాత్రి మాత భాచావో అభయాన్ తగిన మోతదులో ఎరువులు వాడకం పై ప్రచార వారోత్సవ కార్యక్రమం లో ఆయన పాల్గొని ప్రసంగించారు, ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధిక మోతాదులో రసాయన ఎరువులు, పురుగుమందులు వాడటం వల్ల మట్టిలోని సహజమైన బ్యాక్టీరియా మరియు వానపాములు నశిస్తున్నాయని. వాటి వాడకంతగ్గించి, భూమికి ప్రాణం పోయడమే దీని ముఖ్య ఉద్దేశ్యం అని ,భూమిని రక్షించుకోవాలంటే సేంద్రియ సాగు అత్యవసరం అన్నారు సేంద్రియ ఎరువులయినపశువుల ఎరువు, వర్మీ కంపోస్ట్ (వానపాముల ఎరువు), పచ్చిరొట్ట ఎరువులను వాడటం వల్ల భూమికి సహజమైన పోషకాలు అందుతాయన్నారుఅంతేకాకుండా వ్యవసాయంలో "ధాత్రి"ని కాపాడటానికి జీవామృతం వంటి ద్రావణాలు మట్టిని సారవంతం చేసి, పంటకు అవసరమైన సూక్ష్మపోషకాలను అందిస్తాయన్నారుధాత్రి మాతను కాపాడటంలో నీటి పొదుపు ఒక కీలక పాత్ర పోషిస్తుందనీ బిందు సేద్యం ద్వారా నీటిని వృథా చేయకుండా మొక్క మొదళ్ళకే అందించడం వల్ల భూగర్భ జలాలు సంరక్షించబడతాయన్నారు పొలంలోనే ఇంకుడు గుంతలు, చెక్ డ్యామ్‌ల ద్వారా వర్షపు నీటిని భూమిలోకి పంపడం భూమాతకు మళ్ళీ జీవం పోయడం వంటిదన్నారుఒకే పంటను పదేపదే వేయడం వల్ల మట్టిలోని ఒకే రకమైన పోషకాలు తగ్గిపోతాయని. పంట మార్పిడి చేయడం వల్ల భూమి సారం పునరుద్ధరించబడుతుందన్నారు.రక రకాల పంటలను సాగు చేయడం వల్ల నేల కోతను అరికట్టవచ్చునీ,మరియు నేల ఆరోగ్యం మెరుగుపడుతుందని చెప్పారురైతులు తమ భూమికి 'సాయిల్ హెల్త్ కార్డ్' తీసుకోవడం ముఖ్యమని, మట్టి లో ఏయే పోషకాలు తక్కువగా ఉన్నాయో తెలుసుకుని, అవసరమైనంత మేరకే ఎరువులు వేయడం ద్వారా అనవసరమైన రసాయన భారంతో భూమిని కలుషితం కాకుండా కాపాడుకోవచ్చునీ పేర్కొన్నారు కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి షేక్. సుగుణ బేగం, రైతులు పాల్గొన్నారు.

# వి.వో.ఏ. ల కు స్మార్ట్ ఫోన్ల ను పంపిణి చేసిన ఎమ్మెల్యే



**పెనుగంచిప్రోలు,ఏప్రిల్ 23( వార్త ప్రభ )** జగ్గయ్యపేట నియోజకవర్గంలోని మూడు మండలాల్లో వి వోఏ లకు స్మార్ట్ ఫోన్ల పంపిణీ చేసిన ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం గ్రామ సంఘాల సహాయకులకు వి వో ఏ లకు స్మార్ట్ ఫోన్ల పంపిణీ కార్యక్రమాన్ని జగ్గయ్యపేట నియోజకవర్గంలోని పెనుగంచిప్రోలు గ్రామంలో ఉన్న కంఠమనేని ఫంక్షన్ హాల్‌లోగురువారం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలుగుదేశం పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు మరియు జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) , కూటమి నేతలతో కలిసి వి వోఏ లకు స్మార్ట్ ఫోన్లను పంపిణీ చేశారు. ఈ పంపిణీ కార్యక్రమం వత్సవాయి, పెనుగంచిప్రోలు, జగ్గయ్యపేట మండలాల వి వోఏ లకు ఇవ్వడం జరిగింది. ముందుగా ఎమ్మెల్యే జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.వేదిక పైన సి సి కాకాని జ్యోతి ఎమ్మెల్యే కీ పుష్ప గుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు,ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో సేవల సామర్థ్యాన్ని పెంపొందించేందుకు సాంకేతికత ఎంతో కీలకమని పేర్కొన్నారు. స్మార్ట్ ఫోన్ల వినియోగంతో గ్రామ సంఘాల కార్యకలాపాలు మరింత పారదర్శకంగా, వేగవంతంగా నిర్వహించవచ్చని తెలిపారు.ప్రభుత్వ పథకాలసమర్థవంతమైన అమలులో వి వోఏ ల పాత్ర అత్యంత ముఖ్యమని, వారికి అందిస్తున్న ఈ సౌకర్యాలు గ్రామీణాభివృద్ధికి మరింత దోహదపడతాయని చెప్పారు.కార్యక్రమంలో పాల్గొన్న వి వోఏ లు సంతోషం వ్యక్తం చేస్తూ, తమ సేవలను మరింత మెరుగుపర్చేందుకు ఈ స్మార్ట్ ఫోన్లు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు.ఈ కార్యక్రమంలోఎన్టీఆర్ జిల్లా డి ఆర్ డి ఏ పీడీ నాంచారయ్య, జిల్లా సమైక్య అధ్యక్షురాలు కందుల కల్పన, పెనుగంచిప్రోలు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు చింతల సీతారామయ్య, సొసైటీ చైర్మన్ కర్ల వెంకటనారాయణ, తిరుపతమ్మ తల్లి దేవస్థానం అభివృద్ధి కమిటీ చైర్మన్ చుంచు రమేష్, జగ్గయ్యపేట మండల పార్టీ అధ్యక్షులు కట్టా వెంకట నరసింహారావు, మాజీ జడ్పిటిసి గజ్జి కృష్ణమూర్తి, గ్రామ పార్టీ అధ్యక్షులు కొత్తపల్లి సతీష్, మండల సమైక్య అధ్యక్షురాఎలు కర్ల కోటేశ్వరి, నాయిని రజిని, సాగర్ల కృష్ణవేణి, శ్రీనిధి మేనేజర్ కాకాని అల్లెఖ్య , స్థానిక నాయకులు, అధికారులు మరియు గ్రామ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

# పారదర్శకంగా 'జనగణన-2027'

### గాజులరామారం సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శ్రీపాద రామేశ్వర్



**గాజులరామారం, ఏప్రిల్ 23 (వార్తాప్రభ) :** దేశాభివృద్ధికి దిక్సూచిగా నిలిచే 'జనగణన-2027' ప్రక్రియను గాజులరామారం సర్కిల్ పరిధిలో అత్యంత పారదర్శకంగా, పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శ్రీపాద రామేశ్వర్ స్పష్టం చేశారు. గురువారం స్థానిక తత్వ గ్లోబల్ స్కూల్‌లో ఎన్యుమరేటర్లు, సూపర్‌వైజర్ల కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక శిక్షణ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డిప్యూటీ కమిషనర్ మాట్లాడుతూ, ఈ భారీ గణన ప్రక్రియ కోసం 307 మంది ఎన్యుమరేటర్లు, 52 మంది సూపర్‌వైజర్లను నియమించామని తెలిపారు. వీరికి 6 గురు ఫీల్డ్ ట్రైనర్ల ద్వారా అత్యాధునిక డిజిటల్ పద్ధతుల్లో డేటా సేకరణపై శిక్షణ ఇస్తున్నట్లు వెల్లడించారు. "జనగణన అనేది కేవలం అంకెల సేకరణ కాదు, ఇది దేశ భవిష్యత్తు ప్రణాళికలు, సంక్షేమ పథకాల అమలుకు పునాది. అందుకే ఈ ప్రక్రియలో ఎటువంటి లోపాలకు తావు లేకుండా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలి," అని ఆయన ఆదేశించారు.

**శిక్షణలో కీలకాంశాలు:** డిజిటలైజేషన్: సేకరించిన సమాచారాన్ని మొబైల్ యాప్స్ ద్వారా ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయడంపై అవగాహన.ప్రతి ఇంటి సందర్శన: ఎన్యుమరేటర్లు తప్పనిసరిగా ప్రతి ఇంటికి వెళ్లి ఖచ్చితమైన సమాచారాన్ని సేకరించాలి.

ఫీల్డ్ వెరిఫికేషన్: క్షేత్రస్థాయిలో సేకరించిన వివరాలను ఎప్పటికప్పుడు సూపర్‌వైజర్లు సరిచూడటం.

**ప్రజలకు విజ్ఞప్తి** ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఈ కార్యక్రమంలో ప్రజలు కూడా చురుగ్గా భాగస్వాములు కావాలని ఆయన కోరారు. ఎన్యుమరేటర్లు అడిగే వివరాలకు ఎలాంటి సందేహం లేకుండా ఖచ్చితమైన సమాచారం అందించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ శిక్షణా కార్యక్రమంలో వివిధ విభాగాల అధికారులు, గణన సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# యువిక యంగ్ సైంటిస్ట్ కార్యక్రమానికి ఎంపికైన చిన్న మల్లారెడ్డి విద్యార్థిని అభినందించిన కలెక్టర్



**కామారెడ్డి,ఏప్రిల్ 23. (వార్తాప్రభ)**భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) నిర్వహిస్తున్న యువికా యంగ్ సైంటిస్ట్ ప్రోగ్రాం కార్యక్రమం కు చిన్న మల్లారెడ్డి బాలుర ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని రాహుల నిహారికను మరియు గైడ్ టీచర్ ప్రవీణ్ కుమార్ ని కామారెడ్డి జిల్లా కలెక్టర్ ఆసీస్ సాంగ్వాన్ తన కార్యాలయంలో ప్రత్యేకంగా అభినందించారు. పాఠశాల స్థాయి విద్యార్థుల్లో అంతరిక్ష శాస్త్రంపై ఆసక్తిని పెంపొందించడం, శాస్త్రీయ దృక్పథాన్ని అభివృద్ధి చేయడం ప్రధాన లక్ష్యం.ఈ కార్యక్రమంలో భాగంగా దేశవ్యాప్తంగా సైన్సులో వినూత్న కార్యక్రమాల్లో పాల్గొన్న విద్యార్థులను ఎంపికలో భాగంగా చిన్న మల్లారెడ్డిలో తొమ్మిదో తరగతి చదువుతున్న రావుల నిహారిక ఎంపికైంది. ఇందులో దేశవ్యాప్తంగా ఎంపికైన విద్యార్థులకు ఇస్రో శిక్షణ కేంద్రాల్లో ప్రత్యేక శిక్షణ ఇవ్వబడుతుంది. ఇందులో అంతరిక్ష విజ్ఞానం, ఉపగ్రహాల నిర్మాణం, రాకెట్ల పని విధానం, భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రం, గణిత శాస్త్రం వంటి అంశాలపై ప్రాయోగిక మరియు సైద్ధాంతిక శిక్షణ అందిస్తారు. అలాగే ప్రయోగశాల సందర్శనలు, శాస్త్రవేత్తలతో ముఖాముఖి, వివిధ శాస్త్రీయ కార్యకలాపాలు నిర్వహిస్తారు.ఈ సంవత్సరం యువికా కార్యక్రమానికి ఎంపిక ప్రక్రియలో విద్యార్థుల ప్రతిభ, విద్యార్హతలు, సైన్స్‌పై ఆసక్తి, ఆన్‌లైన్ పరీక్షలో సాధించిన మార్కులు వంటి అంశాలను పరిగణలోకి తీసుకున్నారు. దరఖాస్తులు అధికారిక వెబ్‌సైట్ ద్వారా స్వీకరించబడగా, మెరిట్ ఆధారంగా విద్యార్థులను ఎంపిక చేశారు.విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించుకోవడం, ఐ ఎస్ ఆర్ ఓ లో జరుగుతున్న పరిశోధనలు, ప్రయోగాలను తెలుసుకోవడం, శాస్త్రవేత్తలతో ప్రత్యక్షంగా కలుసుకునే అవకాశం ఒక గ్రామీణ ప్రాంత విద్యార్థినికి దక్కడం ఎంతో ప్రశంసనీయమని వారు పేర్కొన్నారు.ఈ అవకాశం నిహారిక భవిష్యత్తులో శాస్త్రవేత్తగా లేదా ఇంజనీర్‌గా ఎదగడానికి ఒక ముఖ్యమైన మొదటి మెట్టుగా నిలుస్తుందని తెలిపారు.ఈ విజయంతో ఇతర విద్యార్థులకు కూడా ప్రేరణ లభిస్తుందని అన్నారు. భవిష్యత్తులో ఆమె మరింత ఉన్నత స్థాయికి చేరాలని ఆకాంక్షించారు. ఈ విజయంతో గ్రామీణ విద్యార్థుల్లో శాస్త్రంపై ఆసక్తి పెరిగి, మరిన్ని అవకాశాలను అందిపుచ్చుకునే దిశగా ముందుకు సాగుతారని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆశీస్ సాంగ్వాన్ గారితో పాటు జిల్లా సైన్స్ అధికారి సిద్ధ రామిరెడ్డి మరియు గైడ్ టీచర్ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

# ఉద్యమకారులను గుర్తించని బీఆర్ఎస్ పార్టీ

**జగిత్యాల,ఏప్రిల్ 23 (వార్తాప్రభ)::**ఉద్యమకారులను గుర్తించని బిఆర్ఎస్ పార్టీ మునిగిపోయే నావ అనీ బిఆర్ఎస్ రెబల్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి కొంకటి లింగ మూర్తి గురువారం ఓ ప్రకటనలో కోరారు. ఈ సందర్భంగా లింగమూర్తి మాట్లాడుతూ పార్టీ ఎదుగుదల కోసం అహర్నిశలు కృషి చేసిన నాయకుడు ఈటల రాజేందర్ పై లేనిపోని ఆరోపణలు చేసి నిరూపించకుండానే బయటకు పంపేసారని గుర్తు చేసిన ఆయన కేసీఆర్ పెద్ద మోసగాడని, ఎందరినో నిండా ముంచిన వ్యక్తిగా అభివర్ణించారు. 1200 మంది బలిదానాలతో తెలంగాణ వస్తేఅన్నింటిని త్యాగం చేసిన వాళ్ళని పట్టించుకోకుండా, వ్యతిరేకంగా పోరాడిన వారికి మంత్రులను చేసినారానని, పోరాడిన వారికి గుంట భూమో, రెండు పడుకల ఇల్లో ఇస్తే కొంత పుణ్యమైన వచ్చేదని, ధరణి పోర్టల్ వల్ల కౌలు దారులు ఏండ్ల తరబడి తెచ్చుకున్న కౌలు చట్టం నిష్ప్రయోజనమయి దొరల భూములు దొరలకు దక్కేలా చేసాయని ఆవేదన వ్యక్తం చేశారు.

# జరిమానా కంటే ప్రాణం మిన్న

### చలాన్లకు బదులు హెల్మెట్లు పంపిణీ చేసిన ఎస్సై అర్జున్... పెనుగంచిప్రోలు పోలీసుల వినూత్న చర్య



**పెనుగంచిప్రోలు, ఏప్రిల్ 23( వార్త ప్రభ )** సాధారణంగా పోలీసులు అంటే వాహనదారులను ఆపి ఫైన్లు వేస్తారని అందరూ భావిస్తారు. కానీ పెనుగంచిప్రోలు ఎస్సై అర్జున్ మాత్రం అందుకు భిన్నంగా ఆలోచించారు. వాహనదారుల జేబులకు చిల్లు వేయడం కంటే వారి ప్రాణాలు కాపాడడమే లక్ష్యంగా ఆయన ఒక సరికొత్త కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. హెల్మెట్ లేకుండా ప్రయాణించే వారికి జరిమానా విధించే బదులు, అక్కడికక్కడే నాణ్యమైన హెల్మెట్లు కొనుగోలు చేసేలా ప్రోత్సహిస్తూ అందరి ప్రశంసలు అందుకుంటున్నారు. హెల్మెట్ లేని వాహనదారులకు రూ. 1000 వరకు జరిమానా విధించే బదులు, అదే ధరకు నాణ్యమైన ఐ ఎస్ ఐ మార్క్ ఉన్న హెల్మెట్‌ను అక్కడికక్కడే కొనుగోలు చేసేలా అది ధరించే విధంగా చర్యలు చేపట్టారు.వాహనదారులు నాణ్యమైన హెల్మెట్లను ఎక్కడ కొనాలో తెలియక ఇబ్బంది పడకూడదనే ఉద్దేశంతో, ఎస్సై స్వయంగా ఒక కేంద్రాన్ని ఏర్పాటు చేయించారు. హెల్మెట్ లేని వారిని ఆపి, జరిమానా వేయకుండా, హెల్మెట్ ధరించడం వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తున్నారు. ముఖ్యంగా ఐఎస్ఐ (ISI) ముద్ర ఉన్న నాణ్యమైన హెల్మెట్లనే వాడాలని, అవి ఎలా ఉండాలో స్వయంగా వాహనదారులకు చూపిస్తూ సలహాలు ఇస్తున్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ అర్జున్ మాట్లాడుతూ మా లక్ష్యం కేవలం జరిమానాలు వసూలు చేయడం కాదు, ప్రతి ఒక్కరూ సురక్షితంగా తమ ఇళ్లకు చేరుకోవాలి. ఒక చిన్న హెల్మెట్ ఒక ప్రాణాన్ని కాపాడుతుంది. జరిమానా కంటే హెల్మెట్ కొనుక్కోవడం తక్కువ ఖర్చుతో కూడుకున్నది మరియు ప్రాణప్రదమైనది అని ఎస్సై అర్జున్ తెలిపారు. ప్రజలు పలు సంఘాల నాయకుల ప్రశంసలు పోలీసులంటే కేవలం కఠినంగా ఉంటారనే భావనను మార్చి, స్నేహపూర్వక పోలీసింగ్‌కు నిదర్శనంగా నిలుస్తున్న ఎస్సై అర్జున్ చొరవను స్థానిక ప్రజలు మరియు వాహనదారులు వేనోళ్ల కొనియాడుతున్నారు. ఈ వినూత్న కార్యక్రమం వల్లనైనా వాహనదారుల్లో మార్పు వస్తుందని ఆశిద్దాం ఇలాంటి ఎస్ఐ ఉండటం పెనుగంచిప్రోలు మండలానికి ఎంతో మంచి విషయం అంటూ కొని ఆడుతున్నారు...

## ఆర్టీసీ కార్మికులకు సంఘీభావం తెలిపిన మాజీ ఎమ్మెల్యే బొల్లం

**కోదాడ ఏప్రిల్ 23 ( వార్త ప్రభ )** తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పరిపాలన వచ్చి - రెండు సంవత్సరాలు పూర్తయింది ఆర్టీసీ సిబ్బంది రెండున్నర ఏళ్లుగా ఓపిక పట్టి ఈరోజు సమ్మెకు దిగాల్సి పరిస్థితి వచ్చిందని కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ ఆర్టీసీ కార్మికులకు మద్దతుగా నిలిచి తన సంఘీభావాన్ని తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వంలో ఉన్న పొన్నం ప్రభాకర్ ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నారు.ఆర్టీసీ కార్మికులను వెంటనే ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి, కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలనే కార్మికులు అడుగుతున్నారు. ఆర్టీసీ ప్రైవేట్ పరం అయ్యే పరిస్థితి వచ్చిందన్నారు.మేధావులు ఏం చేస్తున్నారు, కోదండరామిరెడ్డి లాంటి వ్యక్తులు ఆర్టీసీ కార్మికుల సమ్మెపై మాట్లాడకపోవడం బాధాకరం పొన్నం ప్రభాకర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మధ్య విభేదాలు ఎందుకు ఉన్నాయి , మహాలక్ష్మి ఉచిత బస్సు ప్రయాణం పెట్టి ఆర్టీసీ సిబ్బందిపై ఒత్తిడి పెంచారు. అలాగే పక్క రాష్ట్రం అయినా ఆంధ్రప్రదేశ్ లో ఆర్టీసీని ప్రభుత్వలో విలీనం చేసి ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించారు. అలాగే ఇక్కడ ఎందుకు చేయరు.దీనికి ముఖ్యమంత్రి సమాధానం చెప్పాలి గతంలో ఆర్టీసీ సంస్థకు రావలసిన 200 కోట్ల చెక్కు ఇచ్చారు. దానికి దిక్కు లేదు రేవంత్ ఇచ్చిన చెక్ ఇప్పటికి చెల్లలేదు గతంలో మా బి ఆర్ ఎస్ ప్రభుత్వం ఇచ్చిన బస్సులే జెండా ఊపి ప్రారంభిస్తున్నారు. సర్వీస్ అయిపోయిన బస్సులు తీసివేసి కొత్త బస్సులు తేవాలి, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తామంటే కార్మికులు ఎందుకు సమ్మె చేస్తారు. కార్మికుల్ని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించకపోతే ఆర్టీసీ సమ్మెకు బీ ఆర్ఎస్ పార్టీ మద్దతుగా ఉంటుంది పెద్ద ఎత్తున ఉద్యమాలు చేస్తాం అని హెచ్చరించారు. ఇట్టి కార్యక్రమంలో కోదాడ నియోజకవర్గం టిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు అంతా పాల్గొన్నారు.

## భగీరథ మహర్షి సేవలు సమాజానికి ఆదర్శం

### మహనీయుల స్ఫూర్తితో ముందుకు సాగాలి జిల్లా అదనపు కలెక్టర్ బిఎస్ లత(రెవిన్యూ)

**జగిత్యాల, ఏప్రిల్ 23 ( వార్త ప్రభ ) ::**భగీరథ మహర్షి సేవలు సమాజానికి ఆదర్శం ఆనిజిల్లా అదనపు కలెక్టర్ బిఎస్ లత(రెవిన్యూ) ఆన్నారు.గురువారం జిల్లా కేంద్రంలోని ఐడీఓసీ లో భగీరథ మహర్షి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు.ఈసంధర్భంగా అదనపు కలెక్టర్ బిఎస్ లత (రెవిన్యూ)భగీరథ మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఆనంతరం జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ సమాజ హితం కోసం ఆనాడు భగీరథుడు అవిశ్రాంతంగా కృషి చేసి నేటి సమాజానికి కూడా ఆదర్శప్రాయుడయ్యారని కొనియాడారు.

## చిన్నోడు సూక్తులు



మనసులోని మంచితనము
మాటలోని గొప్పదనము
ఇల ఉపయోగమవ్వాలి
ఉపాధ్యాయుల జ్ఞానము
ఉన్నోళ్లకు కష్టాల్లో
పీకల లోతు నష్టాల్లో
సహకారమందించాలి
ఉపకారమే చేయాలి
ఇరుగుపొరుగు వారితో
ఉండాలి సఖ్యతతో
వివేకం కల్గియుండి
వీలైతే సభ్యతతో
ఆడవద్దు బంధాలతో
ఏమాత్రం యే ఆటలు
సంకుచిత మనసులతో
పాడు చేసుకోకు బ్రతుకులు

**-గద్వాల సోమన్న,**
ఎమ్మిగనూరు,
సెల్ :9966414580

# పార్టీ బలోపేతానికి అంతా కలిసి పని చేయాలి

- రానున్న నూజివీడు మున్సిపల్ ఎన్నికల్లో భారీ మెజారిటీతో విజయం సాధించాలి
- త్రాగునీటి సమస్య తలెత్తకుండా ఒక ప్రణాళికా బద్ధంగా ముందస్తు చర్యలు చేపట్టాలి
- రాష్ట్ర మంత్రివర్యులు కొలుసు పార్థసారథి





**విజయవాడ/ నూజివీడు,ఏప్రిల్ 23 (వార్తాప్రభ) :** రాష్ట్ర గృహ నిర్మాణ మరియు సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రివర్యులు కొలుసు పార్థసాహరధి క్యాంపు కార్యాలయంలో నూజివీడు మున్సిపాలిటీ పరిధిలో జరుతున్న వివిధ అభివృద్ధి పనుల పై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించిన మంత్రివర్యులు కొలుసు పార్థసారథి.మాట్లాడుతూ మున్సిపాలిటీ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలపై. అధికారులంతా సమన్వాయంతో కలిసి పని చేయాలని ఆదేశించారు. పట్టణములో జరుగుతున్న అభివృద్ధి పనులు వేగవంతం చేయడానికి అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు అదేదించారు. మున్సిపల్ అధికారులు పట్టణ అభివృద్ధి, పారిశుద్ధ్యం, మౌలిక సదుపాయలపై జరిగిన పనుల ప్రగతిని వివరించారు. పట్టణంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు ప్రజలకు చేరేలా సమన్వయంతో పనిచేయాలని మంత్రివర్యులు సూచించారు. ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించే దిశగా అధికారులు కృషి చేయాలని ఆదేశించారు. వేసవిలో త్రాగునీరు సమస్య తలెత్తకుండా తగిన జాగ్రత్తలు చేపట్టాలని, పట్టణంలో త్రాగునీరు సమస్య తలెత్తకుండా ప్రణాళిక అబద్ధం గా పనిచేయాలని ఎక్కడైనా మరమ్మత్తులు ఇతర రిపేర్ పనులు చేయవలసిన పక్షంలో తక్షణమే పని పూర్తి చేసి ప్రజలకు త్రాగునీరు సమస్య లేకుండా తగిన చర్యలు చేపట్టాలని మంత్రివర్యులు పేర్కొన్నారు. మున్సిపల్ అధికారులు అంతా సమన్వయంతో పనిచేసే పట్టణాన్ని అభివృద్ధి బాటలో తీసుకెళ్లాలని సూచించారు.అభివృద్ధి కి కావలసిన మౌలిక సదుపాయాల ప్రణాళికలు రూపొందించి ప్రణాళికా బద్ధంగా పనిచేస్తే అభివృద్ధి సాధ్యమని అధికారులంతా కలిసి పనిచేసి అభివృద్ధి సాధించాలని ఆదేశించారు. పట్టణంలో అన్ని వార్డులలో త్రాగునీటి సమస్య, మరియు డ్రైనేజీ సమస్య, శానిటేషన్ సమస్య , మరియు ఇతర సమస్యలు తలెత్తకుండా మున్సిపల్ సిబ్బంది అంతా సమన్వయంతో పనిచేసే పట్టణాన్ని అభివృద్ధి పథంలో నడపాలని ఆదేశించారు. శానిటేషన్ అసలు సరిగా లేదని అనేక ఫిర్యాదులు వస్తున్నాయని దానిని సరిచేసి శానిటేషన్ మెరుగుపరచాలని ఆదేశించారు. అభివృద్ధి ఫలాలు, సంక్షేమ ఫలాలు,అర్హులైన ప్రజలందరికీ సకాలంలో సక్రంగా అందేటట్టు అధికారులంతా అంకితభావంతో పనిచేయాలన్నారు. రానున్న మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించాలంటే నూజివీడు మున్సిపాలిటీ ఒక రోల్ మోడల్ గా నిలవాలని దానికి మీరంతా సమన్వయంతో పనిచేయాలని చూసించారు. అనంతరం పట్టణ ప్రజా ప్రతినిధులు మరియు మాజీ కౌన్సిలర్లతో మాట్లాడుతూ మున్సిపల్ పరిధిలో వార్డులు సంఖ్య పెరగనున్నవి కావున ప్రజా ప్రతినిధులు కలిసికట్టుకుని పనిచేయాలని పాత కొత్త కలయికతో అంతా కలిసి పని చేసి రానున్న మున్సిపల్ ఎన్నికల్లో విజయం సాధించాలని సూచించారు. దానికి మీరంతా కలిసి ఒకరిని ఒకరు సమన్వయంతో, అంకిత భావంతో, పట్టుదలతో పనిచేస్తే, విజయం తథ్యమని అన్నారు.ప్రజా ప్రతినిధులకు దిశా నిర్దేశం చేసిన మంత్రి వర్యులు. అంతా కలిసి పనిచేసి రానున్న మున్సిపల్ ఎన్నికల్లో భారీ మెజారిటీ అందించాలని ఆదేశించారు. ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి మరియు సంక్షేమ ఫలాలు ప్రభుత్వం చేస్తున్న వివిధ పథకాలు ప్రతి ఇంటికి ప్రతి గడపకు చేరేలా అందరూ కృషి చేయాలని, ప్రజలకు వివరించి తెలియపరచాలని మంత్రివర్యులు ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లో నూజివీడు మున్సిపాలిటీ అఖండ మెజారిటీతో గెలిపించి మన గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి బహుమతిగా అందజేయాలని, దానికి అందరి సహాయ సహకారాలు, అందరి కృషి ఉండాలని, అందరూ కలిసి పని చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, నూజివీడు పట్టణ మాజీ ప్రజా ప్రతినిధులు పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ మద్యం, బెల్ట్ షాపులపై కఠిన చర్యలు

- పారదర్శకత కోసం సురక్షా యాప్ స్కానింగ్ తప్పనిసరి
- అధికారులను హెచ్చరించిన ప్రొహిబిషన్, ఎక్సైజ్ కమిషనర్ చామకూరి శ్రీధర్






**ఏలూరు/రాజమండ్రి,ఏప్రిల్ 23 (వార్తాప్రభ) :** అక్రమ మద్యం నియంత్రణ, పారదర్శకత పెంపుపై ప్రొహిబిషన్ ఠ ఎక్సైజ్ కమిషనర్ చామకూరి శ్రీధర్ దృష్టి సారించారు. ఏలూరు, రాజమండ్రి ప్రాంతాల పరిధిలోని జిల్లాలపై ఎస్‌హెచ్‌ఓల వారీగా గురు వారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమీక్షలో ఏలూరు, భీమవరం, కాకినాడ, కొనసీమ, తూర్పు గోదావరి జిల్లాల పనితీరును పరిశీలిస్తూ అక్రమ మద్యం నియంత్రణ, డిజిటల్ మానిటరింగ్, ఆదాయ సేకరణ అంశాలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. సాధారణ జిల్లా స్థాయి సమీక్షలకు భిన్నంగా ప్రతి స్టేషన్ హౌస్ ఆఫీసర్ పనితీరును వ్యక్తిగతంగా సమీక్షించారు. వారి పరిధిలో అక్రమంగా తయారు చేసే మద్యం, బెల్ట్ షాపుల పరిస్థితి, తీసుకున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. స్టేషన్‌లలో సిబ్బంది అందుబాటు, వారి వినియోగం, దాడులు, పర్యవేక్షణ చర్యలపై కూడా సమగ్రంగా సమీక్షించారు. చర్యల్లో కఠినత్వం అవసరమని పేర్కొంటూ, పునరావృత నేరస్తులపై కేసులు నమోదు చేయడం, చర్యలు తీసుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తే తీవ్రంగా పరిగణిస్తామని హెచ్చరించారు. సమీక్షలో ముఖ్యంగా సురక్షా యాప్ అమలుపై దృష్టి పెట్టారు. ప్రతి స్టేషన్ పరిధిలో 100 శాతం స్కానింగ్ జరగాలని ఎస్‌హెచ్‌ఓలకు ఆదేశించారు. డిపో నుంచి వినియోగదారుడి వరకు మద్యం సరఫరా పూర్తిగా ట్రాక్ చేయడానికి ఈ యాప్ ఉపయోగపడుతుందని చెప్పారు. షాపులు, బార్లలో స్టాక్ లిఫ్టింగ్, అమ్మకాల మధ్య తేడాలు ఉంటే వాటిని కచ్చితంగా గుర్తించి అక్రమ మద్యం రవాణాను అరికట్టాలని సూచించారు. స్వయంగా కమీషనర్ సురక్ష యాప్ లో మద్యం సీసాలను స్కానింగ్ ద్వారా తనిఖీ చేశారు. లైసెన్స్ పొందిన షాపులు, బార్లపై తరచూ ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని అధికారులకు ఆదేశించారు. సమయపాలన, సామర్థ్య నిబంధనలు పాటిస్తున్నారో లేదో పరిశీలించాలని, అలాగే నాణ్యతను నిర్ధారించేందుకు మద్యం నమూనాల సేకరణను పెంచాలని సూచించారు. గత సంవత్సరం పనితీరుతో పోల్చి చూస్తూ, అక్రమ వ్యాపారాన్ని అణచివేస్తేనే ప్రభుత్వ ఆదాయం పెరుగుతుందని కమిషనర్ తెలిపారు. విభిన్న చర్యలు, ఆదాయ సేకరణ మధ్య సమతుల్యత అవసరమని పేర్కొన్నారు. సమీక్షలో భాగంగా ఏలూరులోని అజయ్ వైన్ షాపును సందర్శించిన కమిషనర్, సురక్షా యాప్ ద్వారా స్టాక్‌ను స్వయంగా స్కాన్ చేసి పరిశీలించారు. నకిలీ మద్యం విక్రయాలను పూర్తిగా అరికట్టేందుకు యాదృచ్ఛికంగా బాటిళ్లను తనిఖీ చేయాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో ఏలూరు డీసీ శ్రీలత, ఏసీ ప్రభుకుమార్, డీపీఈఓ అవులయ్య, డీపీఈఓ పశ్చిమ గోదావరి సుబ్బారావు పాల్గొన్నారు. రాజమండ్రిలో జరిగిన సమావేశంలో కాకినాడ డీసీ చైతన్య మురళి, రాజమండ్రి డీపీఈఓ శ్రీలత, కొనసీమ డీపీఈఓ కుమరేశన్ తదితరులు హాజరయ్యారు. సమావేశం ముగింపులో, తమ పరిధిలో అక్రమ కార్యకలాపాలను నియంత్రించ డంలో విఫలమయ్యే ఎస్‌హెచ్‌ఓలపై శాఖాపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ స్పష్టం చేశారు.

# మైలవరం పట్టణంలో ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి సమగ్ర చర్యలు

- ఆర్ అండ్ బి,రెవిన్యూ, పంచాయితీ రాజ్ అధికారులతో జాయింట్ ఇన్‌స్పెక్షన్ నిర్వహించి న సీఐ కిషోర్ బాబు





**మైలవరం,ఏప్రిల్ 23 (వార్తాప్రభ) :** ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాదు సూచనల మేరకు మైలవరం పట్టణంలో దీర్ఘకాలికంగా ఉన్న ట్రాఫిక్ సమస్య ,రహదారి భద్రతను పెంపొందించేందుకు అధికారులు సమగ్ర చర్యలు చేపట్టారు.మైలవరం సర్కిల్ ఇన్స్పెక్టర్ కె.కిషోర్ బాబు స్థానిక ఆర్ అండ్ బి, రెవిన్యూ,ఎలక్ట్రికల్ పంచాయితీ రాజ్ అధికారులతో గురువారం జాయింట్ ఇన్‌స్పెక్షన్ నిర్వహించారు.ఈ సందర్భంగా వారు కొన్ని అంశాలపై సమగ్రంగా చర్చించారు. ముఖ్యంగా పట్టణంలో పర్యటిస్తూ వాహనాల పార్కింగ్‌కు అనుకూలమైన ప్రదేశాల గుర్తింపు, బస్ బేలు ఏర్పాటు చేయాల్సిన ప్రాంతాల ఎంపిక,ట్రాఫిక్ రద్దీ తగ్గించే విధంగా కొత్త రహదారుల నిర్మాణం తదితర అంశాలపై చర్చించారు.పట్టణంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించి, ప్రజలకు సౌకర్యవంతమై న, భద్రతతో కూడిన రహదారి వ్యవస్థను అందించడమే ప్రధాన లక్ష్యంగా తీసుకోబడిందని సీఐ తెలిపారు.భవిష్యత్తులో కూడా ఈ విధమైన సమన్వయంతో చర్యలు కొనసాగించబడుతూ, మైలవరం పట్టణాన్ని కంగెషన్ ఫ్రీ మరియు సేఫ్ ట్రాఫిక్ జోన్‌గా అభివృద్ధి చేయడానికి కృషి చేయనున్నట్లు మైలవరం సబ్-ఇన్‌స్పెక్టర్ సుధాకర్ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో తాహశీల్దార్ అబ్దుల్ దరియ, గ్రామపంచాయతీ ఈవో రఫీ, ఎలక్ట్రికల్ ఏఈఈ రమేష్,ఆర్ అండ్ బి విభాగం అధికారులు పాల్గొన్నారు.

# కవులూరులో మట్టి మాఫియా...!

- వెలగలేరు హెడ్ రెగ్యులేటర్ల సమీపంలోని పంట పొలాల్లో నుంచి మట్టి అక్రమ రవాణా
- రాత్రివేళ ఇటుక బట్టీలకు యదేచ్ఛగా తరలిపోతున్న మట్టి
- జెసిబి లు పెట్టి లారీలతో మట్టిని ఇటుక బట్టీలకు భారీగా తరలిస్తున్న వైనం
- గత వారం పదిరోజులుగా జరుగుతున్న మట్టి దందా...!
- రెవిన్యూ అధికారులు, పోలీసులకు తెలిసే జరుగుతుందంటున్న రైతులు
- పట్టించుకోని,రెవిన్యూ, మైనింగ్, విజిలెన్స్, అధికారులు
- బుధవారం అర్ధరాత్రి పోలీసులు పట్టుకున్న 12 లారీలు, ఒక జెసిబి ఏమయ్యాయి...?









**జి.కొండూరు (బ్యూరో చీఫ్): ఎన్టీఆర్ జిల్లా,ఏప్రిల్ 23 (వార్తాప్రభ) :** జి.కొండూరు మండలం కవులూరు గ్రామ శివారు వెలగలేరు హెడ్ రెగ్యులేటర్ల సమీపంలో బుడమేరు డైవర్షన్ ఛానల్ పక్కన రైతుల పంట పొలాల్లో నుంచి ప్రభుత్వ అనుమతులులేకుండా కొంత మంది అక్రమార్కులు 10 అడుగులలోతు పెట్టి గత వారం పదిరోజు లుగా రాత్రివేళ పదుల సంఖ్యలో లారీలతో యధేచ్ఛగా మట్టిని ఇటిక బటీలకు తరలిస్తున్నారు.మట్టి తోలకాలు జరుగుతున్నాయని తెలిసినా సంబంధిత శాఖ అధికారులు అటువైపు కన్నెత్తి చూడటం లేదు. పంట పొలాల్లో నుంచి ఇంత పెద్ద ఎత్తున మట్టి తరలిస్తున్నా రెవిన్యూ అధికారుల్లో ఎలాంటి స్పందన లేదు.

**గురువారం అర్ధరాత్రి పోలీసులు పట్టుకున్న 12 లారీలు, ఒక జెసిబి ఏమయ్యాయి...?** కవులూరు గ్రామ శివారు వెలగలేరు హెడ్ రెగ్యులేటర్ల సమీపంలో బుడమేరు డైవర్షన్ ఛానల్ పక్కన రైతుల పంట పొలాల్లో నుంచి ప్రభుత్వ అనుమతులులేకుండా కొంత మంది అక్రమార్కులు గత వారం పదిరోజులుగా రాత్రివేళ పదుల సంఖ్యలో లారీలతో యధేచ్ఛగా మట్టిని ఇటుక బట్టీలకు తరలిస్తున్నా రని సమాచారం రావడంతో జి.కొండూరు పోలీసులు 23వ తేదీ గురువారం అర్ధరాత్రి మట్టి తోలకాలను అడ్డుకొని మట్టి తరలిస్తున్న 12 లారీలు, ఒక జె సి బి (ప్రొక్లైన్) ని అదుపులోకి తీసుకున్నారు. కాని ఆ లారీలు జెసిబి అక్కడ లేవని పోలీసులు అంటున్నారు.

ఎన్టీఆర్ జిల్లా,మైలవరం మండలంలో మట్టి మాఫియా పెట్రేగిపోతోంది.మండల పరిధిలోని పలు గ్రామాలలో అక్రమార్కులు ఇరిగేషన్ చెరువులు, కాలువలు, పంటపొలాల్లో మట్టి మాఫియాకు తెరలేపారు.జి.కొండూరు మండలంలోని కవులూరు గ్రామ రెవిన్యూ పరిధిలో వెలగలేరు హెడ్ రెగ్యులేటర్ల సమీపంలోని పంట పొలాల్లో నల్లరేగడి మట్టి అక్రమార్కులకు బంగారు 'గని'గా మారింది.ఎలాంటి అనుమతులు లేకుండా సాగు భూముల నుంచి వందల క్యూబిక్ మీటర్ల మట్టిని అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారు.రాత్రివేళ అడ్డగోలుగా లారీలతో మట్టిని తరలిస్తుంటే స్థానిక రెవిన్యూ, పోలీస్ అలాగే మైనింగ్, విజిలెన్స్ అధికారలు పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉందని స్థానిక ప్రజలు గగ్గోలు పెడుతున్నారు.మట్టి తరలిస్తున్న లారీలను పోలీసులు పట్టుకొని కూడా సీజ్ చేయకుండా వదిలేస్తున్నారు.దీంతో ప్రభుత్వానికి రావలసిన ఆదాయానికి గండిపడుతుంది. పలుకుబడి ఉన్న రాజకీయ నాయకులు ప్రభుత్వ అనుమతులు లేకుండా మైలవరం మండలంలో గ్రావెల్ మాఫియాకు పాల్పడేవారు కొందరైతే మట్టి మాఫియాకు పాల్పడేవారు మరి కొందరు.ఇలా వీరి అక్రమ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయలుగా వర్ధిల్లుతుందని స్థానిక ప్రజలు పదవి విరుస్తున్నారు.

**వారం క్రితమే హెచ్చరించాను :వీఆర్వో..** వారం క్రితం పంట పొలాల్లో నుంచి అక్రమంగా ఇటుక బట్టీలకు మట్టి తరలిస్తున్నా రని తెలిసి హెచ్చరించానని కవులూరు గ్రామ రెవిన్యూ అధికారి తెలిపారు.వీఆర్వో హెచ్చరించి నా పట్టించుకోకుండా మట్టి దందా యాదేచ్ఛగా జరుగుతోంది.

**ఏం జరిగిందో...కనుక్కకుంటాం :** కవులూరు గ్రామంలో ప్రభుత్వం అనుమతులులేకుండా కొంతమంది అక్రమంగా ఇటుక బట్టీలకు మట్టి తరలిస్తున్నారన్న దానిపై జి.కొండూరు ఇంచార్జ్ తహశీల్దార్ విజయ్ కుమార్,మండల రెవిన్యూ అధికారి మణిందర్ సింగ్ లను వివరణ కోరగా కవులూరులోనే రీ సర్వే గ్రామ సభ జరుగుతుందని, ఏంజరిగిందో కనుక్కకుంటామని తెలిపారు. తిరిగి ఫోన్ చేస్తే ఇద్దరి నుంచి ఎలాంటి సమాచారం లేదు.

**మట్టి అక్రమ రవాణా జరగకుండా చూస్తాం :** కవులూరు గ్రామంలో ప్రభుత్వం అనుమతులులేకుండా కొంత మంది అక్రమంగా ఇటుక బట్టీలకు మట్టి తరలిస్తున్నారని తెలిసి మట్టి తోలకాలను అడ్డుకోవడం జరిగిందని,మట్టి అక్రమ రవాణా జరగకుండా చూస్తామని ఎస్ఐ సతీష్ కుమార్ తెలిపారు. ఇప్పటికైనా సంబంధిత శాఖ జిల్లా ఉన్నతాధికారులు స్పందించి కవులూరు గ్రామ శివారు వెలగలేరు హెడ్ రెగ్యులేటర్ల సమీపంలో బుడమేరు డైవర్షన్ ఛానల్ పక్కన రైతుల పంట పొలాల్లో జరుగుతున్న మట్టి మాఫియాను అరికట్టాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

# వన్ స్టాప్ సెంటర్లుగా పశు ఔషధి విక్రయ కేంద్రాలు

- అందుబాటులో వెటర్నరీ మందులు, అనుబంధ ఉత్పత్తులు
- కేంద్రాల ఏర్పాటుకు కొత్తగా మూడు సొసైటీలకు అనుమతులు
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**విజయవాడ, ఏప్రిల్ 23 (వార్తాప్రభ) :** పశు సంవర్ధక రంగ అభివృద్ధిలో కీలకమైన పశు ఔషధి విక్రయ కేంద్రాలు (పీఏవీకే) వన్ స్టాప్ సెంటర్లుగా సేవలందిస్తాయని.. వెటర్నరీ మందులతో పాటు అనుబంధ ఉత్పత్తులు కూడా ఈ కేంద్రాల్లో అందుబాటులో ఉంటాయని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. గురువారం కలెక్టరేట్ శ్రీ ఏవీఎస్ రెడ్డి హాల్‌లో కలెక్టర్ లక్ష్మీశ అధ్యక్షతన జిల్లాస్థాయి ఎంపిక కమిటీ సమావేశం జరిగింది. నందిగామ, తిరువూరు, మైలవరం పశువైద్యశాలల్లో పశు ఔషధి విక్రయ కేంద్రాల ఏర్పాటుకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి అర్హతలున్న ప్రైమరీ షీప్ బ్రీడర్స్ కోపరేటివ్ సొసైటీ, రైతు ఉత్పత్తి సంఘాలకు అనుమతులు ఇవ్వాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ తక్కువ ధరలకు నాణ్యమైన జనరిక్ ఔషధాలను అందించి పాడి రైతులకు పశువైద్య ఖర్చుల భారాన్ని తగ్గించాలనే లక్ష్యంతో ఔత్సాహిక సంఘాల ద్వారా పశు ఔషధి విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేయడం జరుగుతోందని, బ్రాండెడ్ డ్రగ్స్‌తో పోల్చితే జనరిక్ ఔషధాలు 40 శాతం నుంచి 85 శాతం వరకు తక్కువ ధరకు లభిస్తాయని తెలిపారు. అర్హతలు కలిగిన ఫార్మసిస్టులను అందుబాటులో ఉంచడంతో పాటు మార్గదర్శకాల ప్రకారం అర్హతలున్న సంస్థలకు మాత్రమే పశు ఔషధి విక్రయ కేంద్రాల ఏర్పాటుకు అనుమతలిస్తున్నట్లు కలెక్టర్ లక్ష్మీశ వెల్లడించారు. ఈ కేంద్రాలు పారదర్శకంగా, జవాబుదారీతనంతో కార్యకలాపాలు నిర్వహించేలా నిరంతర పర్యవేక్షణ ఉంటుందని కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. సమావేశంలో జిల్లా పశుసంవర్ధక అధికారి డా. ఎం.హనుమంతరావుతో పాటు సహకార, డ్రగ్ కంట్రోల్, ఆర్ అండ్ బీ తదితర సమన్వయ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పల్లెపాలెం హైస్కూల్ నందు నేస్తం బడికిరా కార్యక్రమం...



**కృత్తివెన్ను,ఏప్రిల్ 23 (వార్తాప్రభ) :** నేస్తం బడికి రా "పాఠశాల ఎన్రోల్మెంట్ డ్రైవ్ లో భాగంగా గురువారం కృత్తివెన్ను మండలం పల్లె పాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులను కలవడం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు టీవీవీ ప్రసాదు విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలకు పంపి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయవలసిందిగా కోరారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత కొప్పినీడి సూర్య ప్రకాష్ మాట్లాడుతూ గౌరవ కలెక్టర్ బాలాజీ జిల్లా విద్యాశాఖాధికారి యు వి సుబ్బారావు ఆదేశానుసారం ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే దిశగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని,ప్రభుత్వ పాఠశాలలో రాష్ట్ర ప్రభుత్వం ఉచిత పాఠ్యపుస్తకాలు రెండు జతల యూనిఫామ్ షూలు బెల్ట్ లు అలాగే రుచికరమైనటువంటి పోషకాహారం డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం ద్వారా రోజుకొక ఆరోగ్యకరమైన మెనూ ద్వారా విద్యార్థులకు భోజనం అందజేయడం జరుగుతుందని వారానికి పోషక విలువలు కలిగిన ఐదు గుడ్లు చిక్కీలు అందజేయడం జరుగుతుందని అత్యంత ప్రతిభావంతులైన ఉపాధ్యాయులతో బోధన జరుగుతుందని కాబట్టి గ్రామంలోని తల్లిదండ్రులందరూ కూడా తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించి వారి భవిష్యత్తును తీర్చిదిద్దవలసిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఏసు పాదం ఎన్ నరసింహస్వామి విద్యా కమిటీ చైర్మన్ మోకా రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada, Andhra Pradesh and Published from D.No.30-22-3/11, Beside Union Bank Of India, Kotha Vantena Road, Seetaramapuram, Vijayawada - 520004, A.P. Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188